

# ప్రశ్నభూమి

## వాడ్రేవు చినవీరభద్రుడు

సబార్డినేట్ జడ్జి కోర్టుహాలు ఎన్నడూ లేనంతగా కిటకిటలాడుతోంది. మి-మండల రెవెన్యూ అధికారి కె. మోహనచంద్ర పైన మండలాధ్యక్షుడు గరుగుబిల్లి రామి నాయుడు పెట్టిన కేసు విచారణ చివరిదశకు చేరుకుంది.

జిల్లా అంతటా సంచలనం రేకెత్తించిన కేసు గత ఆర్నెల్లుగా కోర్టులో నలుగుతూ అన్ని దశలూ దాటి ముగింపుకు వచ్చింది. ప్రభుత్వాధికారులూ, రాజకీయ వర్గాలూ, పాత్రికేయులూ అందర్నీ ఆకర్షించిన కేసు కావడంతో కోర్టు తెరిచేవేళకే ఎక్కడెక్కడివారూ వచ్చి చేరారు. హాలు మొత్తం నిండిపోగా కొంతమంది గది బయట తలుపు దగ్గరా, కిటికీల దగ్గరా జమకూడారు. అక్కడ చోటు దొరకనివారు కోర్టు ఆవరణలోని వేపచెట్ల కిందా, నిద్రగన్నేరు చెట్లకిందా గుంపులు గుంపులుగా చేరి మాటల్లో పడ్డారు.

జనవరి నెల చివరికి వస్తున్నా, పొద్దు బాగా ఎక్కినా ఇంకా గాలిలో చలి పోలేదు. శిశిర ఋతువు రాబోతున్న జాడగా పసుపు రంగుకు తిరిగిన ఆకులు చెట్ల కొమ్మల మీద నిలవలేక గాలిలో తేలుకుంటూ పోతున్నాయి. కక్షిదారుల కోసం కోర్టు పక్షులకోసం, టీ కాఫీలు అమ్మే బండ్లు నెమ్మదిగా స్టవులు వెలిగించాయి. వేరుశనక్కాయలూ, బఠానీలు అమ్మేవారు కూడా నెమ్మదిగా చేరుకున్నారు. ఒకరిద్దరు లాయర్లు, పోలీసులు కోర్టు ఆఫీసు గదుల్లో మంతనాలు చేస్తున్నారు.

కోర్టు హాల్లో ఇంకా మాజిస్ట్రేటు ప్రవేశించలేదు.

మోహనచంద్ర ఎవరితో మాట్లాడకుండా వెనుక బెంచీపైన కూర్చుని ఉన్నాడు. అతని పక్కన మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుభాస్‌చంద్రబోస్, గ్రామ పాలనాధికారి రాగి ఎల్లయ్యా నిల్చుని ఉన్నారు. వాళ్లు చిన్న గొంతుకలో తమలో తాము మాట్లాడుకుంటున్నారు. కానీ వారి స్వరంలోనూ వారి హావభావాల్లోనూ తమ ఎమ్మార్వో పట్ల ఒక సహానుభూతి, గౌరవం ద్యోతకమయ్యేలా ప్రవర్తిస్తున్నారు. రామినాయుడూ, అతని పార్టీ కార్యకర్తలూ, గ్రామ సర్పంచీ మరొకపక్క గోడకి ఆనుకొని నిలబడి ఉన్నారు. రామినాయుడు ఉండుండి గ్రామ సర్పంచి భుజంపైన చెయ్యివేసి అతనితో ఏదో మాట్లాడుతూ మధ్యలో ఆలోచనాపూర్వకంగా తల పంకిస్తున్నాడు. బహుశా ఎమ్మార్వో, ఎంపీపీ ఇద్దరూ కూడా ఈ కేసు ఎందుకు మొదలయ్యిందా, ఎటువంటి మలుపులు తిరిగిందాని నెమరు వేసుకుంటూ ఉండవచ్చు.

ఆరునెల్ల కిందట ఆగష్టు పధ్నాలుగు రాత్రి, తెల్లవారితే స్వాతంత్ర్య దినోత్సవం అనగా ఆ రాత్రి ఎనిమిది, ఎనిమిదన్నర మధ్య రామినాయుడు భార్య నడుపుతున్న చౌకధరల దుకాణాన్ని ఎమ్మార్వో తనిఖీ చేయడానికి పోయాడు. దుకాణంలో రేషనుకార్డులు పెద్దమొత్తంలో దొరికాయనీ, పేదలకు అందకుండా నిలవ చేసిన బియ్యం బస్తాల్ని పట్టుకున్నాడనీ, దానివల్ల సంభవించే క్రిమినల్ కేసులకు భయపడి రామినాయుడు-తనిఖీ పేరున ఎమ్మార్వో తన ఇంటిలోకి చొరబడి తన భార్యతో అసభ్యంగా ప్రవర్తించబోయాడని కోర్టులో ఫిర్యాదు చేశాడని రెవెన్యూ అధికారుల వాదన.

అలాకాదు, ఎమ్మార్వో తనిఖీ చేయదల్చుకుంటే రాత్రివేళ మాత్రమే ఎందుకు రావాలనీ, వచ్చినవాడు దుకాణంలో ప్రవేశించకుండా తన ఇంట్లో ఎందుకు

ప్రవేశించవలసి వచ్చిందనీ, ప్రవేశించడంతో ఆగకుండా తన భార్యతో మాటలు పెంచవలసిన పనేమిటని రామి నాయుడు వాదన. ఆ రాత్రి ఎనిమిది గంటల వేళ ఎమ్మార్వో తన బండి దిగి చౌకధరల దుకాణం తనిఖీ చేయబోతే అది మూసి ఉందనీ ఆ దుకాణం రామి నాయుడు ఇంట్లో ముందువైపు పక్కగా ఉండే ఒక చిన్నగది అయినందువల్లా దాన్ని అతని భార్యనే నడుపు తున్నందువల్లా అతని భార్యని ఎమ్మార్వో పిలవవలసి వచ్చిందనీ దాన్ని రామినాయుడు మరొకలా చూపించే ప్రయత్నం చేస్తున్నాడనీ రెవెన్యూ ఇన్స్పెక్టర్ చెప్తున్నాడు.

కానీ ఆ రాత్రి వాళ్లు వచ్చింది ఎనిమిది గంటలకు కాదనీ, ఎనిమిదిన్నరకనీ అప్పుడు వర్షం పడుతోందనీ, కరెంటు లేదనీ ఆ టైములో ఏ చౌకధరల దుకాణమైనా మూసే ఉంటుందనీ అటువంటి వేళ ఎమ్మార్వో తన ఇంటి తలుపు తట్టడంలో దురుద్దేశాన్ని అందరూ గమనించాలని రామినాయుడి విన్నపం. అతని వాదనని నిరూపించుకోవడానికి వందమందికి పైగా సాక్షుల్ని అతను ప్రవేశపెట్టాడు. చీకట్లో వర్షం పడు తుండగా, ఆ బురదలో, ఆ రాత్రి అందరు సాక్షులు అక్కడ ఎలా వుండవచ్చనీ, అప్పుడేదో జరగబోవచ్చని వాళ్లు ముందే ఎలా ఊహించారనీ, దాని వెనుక రాజకీయ దురుద్దేశ్యాన్ని కోర్టు గమనించాలనీ గ్రామ పాలనాధికారి విన్నవిస్తూ వచ్చాడు. చౌకధరల దుకాణానికి వున్న తలుపూ, ఇంటి తలుపూ ఒక్కలానే ఉంటాయని చీకట్లో ఒక తలుపు తట్టబోయి మరొక తలుపు తట్టి ఉండవచ్చనీ అలాగే ఎమ్మార్వో తనిఖీకి పోయినవేళ ఎనిమిది గంటలా ఎనిమిదిన్నరా అన్నది నిరూపించడం కష్టమనీ వర్షం పడుతుండే వేళలో టైముని ఖచ్చితంగా గమనించడం సాధ్యంకాదనీ అందువల్ల ఒకవేళ ఎదిరి సాక్షులు చెప్పేది నిజమే అనుకున్నా ఎమ్మార్వో చేసిన పనిని 'మిస్టేక్ ఆఫ్ ఫాక్ట్'గా గమనించాలని లాయరు వాదించాడు.

కేసులో కీలకమైన మనిషి రామినాయుడి భార్య ఇప్పటిదాకా కోర్టుకి హాజరు కానేలేదు. ఆమెకి మూర్ఛ వ్యాధి ఉందనీ, కోర్టు హాల్లో ప్రవేశిస్తే జనాన్ని చూసి బెదిరి మూర్ఛపోతుందనీ, అందువల్ల ఆమెకి బదులుగా ఆ సంఘటన జరిగినప్పుడు తను కూడా ఉన్నందున తన సాక్ష్యం చాలుననీ రామినాయుడు జడ్జికి చెప్పుకున్నాడు. ఒకవేళ సాక్ష్యం చాలకపోతే అప్పుడు ఆమె దగ్గరకు ఒక కమీషనర్ను పంపి వాంగ్మూలం తీసుకో వచ్చని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహా ఇచ్చాడు. అంత వరకూ పోలీసు నమోదు చేసిన స్టేట్మెంట్ ఆధారంగా విచారణ కొనసాగిస్తే చాలని కూడా ప్రాసిక్యూటర్ జడ్జికి చెప్పుకొన్నాడు.

జరిగిన సంఘటన పైన పత్రికలు రెండురకాలుగానూ రాశాయి. ఎమ్మార్వోకి వ్యతిరేకంగా రాసినవారు రాజకీయ ఒత్తిడికి లోనయ్యి రాశారని రెవెన్యూ వర్గాలు అంటుంటే, అతనికి అనుకూలంగా రాసినవాళ్లు ప్రభుత్వానికి అమ్ముడుపోయిన వాళ్లని ఎదుటివాళ్లు ఆరోపించారు. ప్రజాభిప్రాయంలో కూడా ఒక చీలిక స్పష్టంగా కనిపించింది. ఎమ్మార్వో కుర్రవాడు, ఏదో ఒక మేలు ప్రజలకి చెయ్యాలన్న తపన ఉన్నవాడు, అతను స్ట్రిక్ట్గా ఉన్నందున రాజకీయశక్తులు అతన్ని అప్రతిష్ట పాలు చేయడానికి పన్నిన కుట్ర అని ఒక వర్గం అంటే, నిజానిజాలు చెప్పడం కష్టమనీ ఎమ్మార్వో ఇంకా పెళ్లికాని యువకుడనీ కేవలం సదుద్దేశంతోనే అతను ఆ రాత్రి వేళ ఆ తనిఖీకి వెళ్లి ఉంటాడని నమ్మలేమనీ మరోవర్గం వాదించారు. తలలు పండిన కొందరు పెద్దలు నిజానిజాలు ఏమయినప్పటికీ ఎమ్మార్వో అనుభవం లేకుండా దుడుకుతనంతో చేసిన పని అనీ అందువల్లే ఇబ్బందిలో పడ్డాడనీ ఒక జీవితసత్యాన్ని కనుగొన్న సంతోషంతో వ్యాఖ్యానిస్తూ ఉన్నారు.

ఇంతలో అందరి శబ్దాల్నీ, నిశ్శబ్దాన్నీ తుడిచి పెడుతూ కోర్టుహాల్లోకి సబ్జడ్జి ప్రవేశించాడు. ఆయన ముందు కోర్టు బంట్రోతు ఎర్రబిళ్ల డవాలు ధరించి ముందు అడుగులేస్తూ కోర్టునుద్దేశించి జడ్జి వచ్చినట్టుగా కోర్టు ప్రొసీడింగ్స్ మొదలు కాబోతున్నట్టుగా సూచన చేసే ఒకలాంటి అరుపు ఏదో అరిచి పక్కకి తప్పుకున్నాడు.

మాజిస్ట్రేట్ని చూస్తూనే కోర్టు హాల్లోని వారంతా లేచి నిలుచున్నారు. కొందరు దేవుడి విగ్రహానికి మొక్కినట్టుగా ఆయనకు మొక్కారు.

తిరిగి అందరూ కూర్చోబోతున్న మొదటి కొన్ని క్షణాల్లోనే కొందరు లాయర్లు ఆయన ఎదటికి పోయి వినయంగా తమ తలల్నీ, శరీరాల్నీ వంచి తమ కేసుల్లో సాక్షులు రాలేదనో, పార్టీలు రాలేదనో మరో కారణం చేతనో వాయిదాలు కోరుకున్నారు. వారి కోరికల్ని మాజిస్ట్రేట్ మంజూరు చేస్తున్న సమయంలో బెంచి క్లార్క్ వాటిని నమోదు చేసుకుంటున్నాడు. కోర్టు టైపిస్టు మాజిస్ట్రేట్ ఎదురుగా చిన్న టేబిలుపైన తన పాత రెమింగ్టన్ టైపురైటర్ని సరిచేసుకుంటున్నాడు. వాయిదాలు పొందిన లాయర్లు మరొకసారి మాజిస్ట్రేట్కి

శిరసు వంచి నమస్కరించి సెలవు తీసుకుని బయటకు పోతుంటే ఎమ్మార్వో తరఫున డిఫెన్సు వాదన విని పిస్తున్న లాయరూ, పబ్లిక్ ప్రాసిక్యూటరూ ముందుకు వచ్చారు. వారిని చూసి బెంచి క్లార్కు వారి కేసుకు సంబంధించిన ఫైలుని తీసి మాజిస్ట్రేట్ అనుమతి కోస మన్నట్టుగా ఆయనవైపు చూస్తున్నాడు.

లాంఛనప్రాయమైన ప్రొసీడింగ్స్ ముందు కానిచ్చి తరువాత చాలా ముఖ్యమైన అంశం వైపు మొగ్గు చూపేవాడిలా మాజిస్ట్రేట్ వారిని చూస్తూ "అం అ... ఈ కేసు లో సాక్ష్యాలన్నీ వినడమై పోయింది కదా!" అన్నాడు.

ఆయన నోటి వెంట సాక్ష్యం అన్న పదం వినగానే అంతదాకా ఒక పక్కగా నుంచున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముందుకు అడుగువేసి మాజిస్ట్రేట్ కళ్లలో పడేలా తను అటెన్షన్‌లోకి వస్తున్నట్టుగా భంగిమని మార్చాడు. మళ్లీ మాజిస్ట్రేటే అందుకుని, "ఈ కేసు పూర్తి అయిపోయేదే కానీ లాస్ట్‌టైం మీ క్లయింటు చెప్పుకునేదేమన్నా ఉందా అని అడిగినప్పుడు ఆయన తనొక స్టేట్‌మెంట్ ఇవ్వా లనీ, అది కొంత లెంగ్తీగా ఉంటుందనీ టైము ఇవ్వా లనీ అన్నాడు కదా! ఈరోజు అది విందాం," అన్నాడు ఎమ్మార్వో తరఫు లాయర్తో.

ఆ మాట వినబడగానే మోహనచంద్ర ముందుకి అడుగు వేశాడు. అతను ఆ మాట ఎక్కడ వినలేదో అన్నట్టుగా అతని లాయరు కూడా అతనివైపు తిరిగి ముందుకు రమ్మన్నట్టుగా సైగ చేసాడు.

ముందుకి వచ్చిన మోహనచంద్రని మాజిస్ట్రేట్ ఎదురుగా విట్నెస్‌బాక్స్ ఉండవలసినచోట ఉన్న కుర్చీ దగ్గరకు కోర్టు కానిస్టేబిలు దారి చూపాడు. మోహన చంద్ర చాలా ఉదాసీనంగా అటు అడుగువేశాడు. అతనిలో ఒక నీచమైన అభియోగాన్ని ఎదుర్కొంటున్న మనఃస్థితికన్నా భిన్నమైనదేదో ఉంది. ఇంకా పసిదనం ఛాయ వదలని ఆ యువవదనంలో ఒక మసకనీడ, అలాగే ఒక తేలికపడిన మనసుని కోరుకునే సాధకుడి ముఖంలో ఉండేలాంటి వెలుగులాంటివేవో ఉన్నాయి. అతనితో కోర్టు సత్యం చెప్పించే ప్రమాణాలు చేయిం చిన లాంఛనం ముగిసాక అతడు ఒకటి రెండు నిముషాల పాటు ఏమీ మాట్లాడకుండా మాటలకోసం తడుముకుంటున్నట్టుగా మౌనంగా ఉండిపోయాడు. అంతసేపూ మాజిస్ట్రేట్ అతడినే కుతూహలంగా చూస్తూ ఉన్నాడు. ఆ ముఖంలో కేసులు వినడమే, తీర్పులు ఇవ్వడమే జీవితంగా మారిపోయిన ఒక నిశ్చింత, నిశ్చలత వున్నాయి. మీసంలో ఒకటి రెండు వెంట్రుకలు తెలుపు తిరుగుతున్న ఆయన ముఖం మరికొద్ది రోజుల్లో ఆయన జిల్లా జడ్జి కాబోతాడనీ, రిటైర్ అయ్యేలోగా హైకోర్టు జడ్జి కాగలడనీ సంకేతమిస్తున్నాయి. కానీ ఆయన ఎదుట నిందితుడిగా నిల్చున్న యువకుడి చూపులు ఆయన మీద లేవు. అసలవి ఎవరిమీదా లేవు. అతడు కొద్దిసేపటికి తనలో తను గొణుక్కుంటు న్నట్టుగా "నేను చెప్పాల్సింది చాలా ఉంది. దయచేసి నా మాటలు పూర్తిగా చెప్పుకునేదాకా నాకు ఎవరూ అడ్డురాకండి," అని మొదలుపెట్టాడు.

## 2

"ఈ కేసు విచారణ పూర్తయిందనీ ఇక తీర్పు ఇవ్వడమే మిగిలి ఉందనీ మీతో సహా అందరూ అను కుంటున్నారు. కానీ నాకెందుకో ఈ కేసు ఇప్పుడే ఇంకా మొదలయ్యింది. నిజమైన విచారణ ఇంకా మొదలు పెట్టాల్సి ఉందనీ అనిపిస్తోంది. కేసు అంటే పైపైన చూస్తే అది ఒక సాధారణమైన క్రిమినల్ కేసు. ఇందులో నిరూపించేందుకు ఏమంత పెద్ద విషయముందని నేను అనుకోవడంలేదు. అలాగని నేను దీన్ని తక్కువ చెయ్యడం లేదు. ఒక సాధారణమైన కేసుగా కూడా ఇది నాకెంత మనస్థాపాన్ని కలిగించాలో అంతా కలిగించింది. నా కెరీర్ ప్రారంభంలో నన్నెంత అప్రతిష్టకి గురి చెయ్యాలో అంతా గురిచేసింది. నన్ను తోయవలసి నంత దాకా అగాధపు అంచుదాకా నెట్టివేసింది ఆ మీదట నాకున్నది పాతాళంలోకి కుంగిపోవడమే. ఆ సంగతి నాకు తెలుసు. ఎంత అర్థం కావాలో అంతా అర్థం అయింది. కానీ నేను ఆ అంశంలో ఆలోచిం చడంలేదు. నేను చెప్ప బోయేది మీకు కొంత వింతగా అనిపించ వచ్చు. కానీ ఇది కొన్నాళ్లుగా నన్ను తీవ్రంగా పీడిస్తోంది. దీన్ని మీతో పంచుకుంటే తప్ప దీన్నించి విడుదల కాలేను. ఒక మాజిస్ట్రేట్‌గా మీరు దీన్ని వినాలని నా ఆతృత.

"ముందు దీన్ని ఎలా ఉందో అలానే చూద్దాం. ఇంతకీ ఏమిటిది? ఆ రాత్రి ఏమి జరిగింది? తెల్లవారితే ఇండిపెండెన్స్ డే. ఆ సాయంకాలం, అంటే సాయం కాలమని కాదు. చీకటిపడింది. వానవల్ల, మబ్బువల్ల సాయంకాలపు చీకటికే అంతా అర్థరాత్రిలా ఉండింది. ఆ వేళప్పుడు నేను జి-గ్రామం కేంపులో ఉన్నాను. మీకు తెలుసు ఆ గ్రామం మి-గ్రామానికి శివారు గ్రామం. వాళ్ల రేషన్ కూడా మి-గ్రామపు ఫెయిర్‌ప్రైస్ షాపు నుంచే తెచ్చుకోవాలి. అంటే నామీద ఫిర్యాదు చేసిన రామి

నాయుడుగారి శ్రీమతి నడిపే దుకాణం నుంచి. ఆరోజు నాతోపాటు మా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఏఓ కూడా వున్నారు. ఈ వివరాలన్నీ మీరు ముందే విన్నారు. తిరిగి ఇవన్నీ ఏకరువుపెట్టి మీ కాలాన్ని ఖర్చు చేయడం నా ఉద్దేశం కాదు. కాని నేను చెప్పాలనుకున్నది సరిగా చెప్ప డానికి మళ్లా ఈ వివరాల్నుంచే మొదలుపెట్టక తప్పట్లేదు,'' అంటూ మాజిస్ట్రేట్ అభిప్రాయం తెలుసు కోడానికన్నట్టు ఒక క్షణం ఆగాడు. మాజిస్ట్రేట్ ముఖం లో ఏ విధమైన అభ్యంతరం కనబడకపోయేటప్పటికి మళ్లా మొదలుపెట్టాడు.

''ఆరోజు కేంపులో మేం భూమి తనిఖీలు పూర్తి చేసుకుని వచ్చేస్తుండగా, మరుసటిరోజు ఫంక్షన్ కోసం ఏర్పాట్లు చేసుకోవాల్సిన తొందర మా మనసులో కదు ల్తుండగా, ఆకాశమంతా మబ్బులు కమ్మి పెద్దవర్షం వచ్చే సూచన కనిపిస్తుండగా, తొందర తొందరగా మి-కి వచ్చేస్తుండగా అప్పుడు జరిగింది ఆ సంఘటన. ఆ తరువాత నేను చాలా ఆలోచించాను. ఆ చిన్న, అతి చిన్న ఆ సంఘటన ఆరోజే ఎందుకు జరగాలి, నా కళ్ల ముందే ఎందుకు జరగాలి అని. జీవితాన్ని మలుపు తిప్పే కొన్ని అతి అరుదైన సంఘటనలు ప్రతి ఒక్కరి జీవితంలో సంభవిస్తాయి. బుద్ధుడి జీవితంలో జరిగి నట్టే. కానీ ఆ ఇన్సిడెంట్లలో విశేషమేమిటంటే అవి మామూలు సంఘటనలే కావడం. మామూలుగా మనం ప్రతిరోజూ చూసేవే కావడం. మనం చూసి కూడా పట్టించుకోనివే కావడం. కాని ఆ వైఫల్య క్షణాల్లో ఎందుకో మనం వాటిపట్ల మామూలుగా ప్రతిస్పందించి నట్టుగా చూసీ చూడనట్టు పోలేం. ఒక క్షణం ఆగుతాం. అదిగో ఆ ఆగడమే మన జీవితాన్ని మార్చేస్తుంది.

''ఆరోజు మేం తొందరతొందరగా వచ్చేస్తున్నాం కదా! మేం హరిజనవాడ మీంచి వస్తుండగా అక్కడ ఒక తల్లి తన పిల్లని చావబాదుతోంది. ఆ పిల్లకి ఎనిమి దేళ్లు మించి ఉండవు. చింపిరి జుత్తు. పేదవాళ్ల పిల్ల ఎలా ఉంటుందో అలానే ఉంది. ఆ తల్లి కూడా ఒక దుర్భర దారిద్ర్యంలో మగ్గే తల్లి ఎలా ఉంటుందో అలానే వుంది. ఆ తల్లి ఆ పిల్లని ఎలా కొడుతోందంటే ఆ వంకన చంపేస్తుందేమో అనిపించింది. నేను ఉండ లేకపోయాను. బహుశా నా సర్వీసులో మరొక ఐదేళ్లు గడిచి ఉంటే నేను అటువంటి సమయంలో అక్కడ ఆగకపోయి ఉండేవాణ్ణేమో. అసలు ఈ ఉద్యోగం చెయ్యకుండా మరొక ఉద్యోగం చేస్తుండి నట్టయితే కూడా ఆగి ఉండేవాణ్ణికానేమో. ఏమయి తేనేం ఆగాను. ఆగి ఆ తల్లిని చెయ్యి పట్టుకు ఆపాను. 'ఎందుకమ్మా! ఆ చిన్న బిడ్డని అంతలా కొడుతున్నావు? ఏమి కష్టం వచ్చింది?' అని అడిగాను. నా ప్రశ్నలో ఏ అమాయకత్వం ఉందోగాని ఆ తల్లి ఒక క్షణం నాకేసి అయోమయంగా చూసి వెంటనే ఒక్కసారిగా భోరున ఏడ్చింది. ఆపైన నెమ్మదిగా కూడబలుక్కుని చెప్పింది. 'ఏం చెప్పను బాబూ! దానిది ఎంత పొట్ట అయినా దాని ఆకలి నన్ను తినేస్తోంది. ఎంత పెట్టు. ఇంకా కావాలి అంటుంది. ఎక్కడనుంచి తేను. ఏమి పెట్టను? చెప్తే వినదు, ఊరుకోదు. అందుకే ఏం చెయ్యలేక దాన్ని సముదాయిస్తున్నాను' అంది.

''ఆ మాట, ఆ సముదాయించడం అన్నది ఆమె మాట కాదు. అటువంటి అర్థం వచ్చేటట్టుగా ఏదో అంది. కానీ ఆ మాటలో దారుణమైన నిస్సహాయత్వం, ఒక వ్యంగ్యం, ఒక తల్లి శోకం ఉన్నాయి. ఆ మాట మొత్తం వ్యవస్థను, మొత్తం ప్రభుత్వాన్ని నిలదీసేదిగా ఉంది. అది ఎందుకనో నన్ను హృదయం లోపల్నుంచి ఒక కత్తి పెట్టి తిప్పి చీల్చినట్టుగా అనిపించింది. నేను నాకేదో అదృశ్యశక్తి ఏదో బాధ్యత అప్పగించినట్లుగా ఆ తల్లినీ, ఆ బిడ్డనీ నిజంగా సముదాయించాల్సిన వాడిలా నా పనులన్నిటికన్నా అదే ముఖ్యమైన పనిలా అక్కడ ఆగిపోయాను. ఆగిపోయి 'ఎందుకు? ఇంట్లో బియ్యం లేవా?' అని అడిగాను. అడుగుతూనే ఇంట్లో అడుగు పెట్టాను.

''ఆ ఇల్లు, దాన్ని ఇల్లు అనాలా, ఆ చీకటిగుహ ఏదో ఒక మృగం నోరు ఆవులించుకున్నట్టుగా ఉన్న ఆ చీకటి సొరంగంలో అడుగుపెట్టి చూద్దునుకదా అక్కడ మనుషులు బతకడానికి కావల్సినవేమీ లేవు చివరికి గాలీ వెలుతురుతో సహా. మొదటిసారి రోగాన్నీ, ముసలితనాన్నీ, చావునీ చూసిన సిద్ధార్థుడు కూడా అంత చలించిపోయుండడు. నన్ను నేను సంబాళించు కోలేకపోయాను. ప్రభుత్వం నాకు నా మండలానికి సివిల్ సప్లై ఆఫీసరు బాధ్యతలు కూడా అప్పగించిందని నేను గుర్తు చేసుకున్నాను. అప్పటికి వారం ముందే ఎమ్.ఎల్.ఎస్ పాయింట్ నుంచి రైస్ లిఫ్ట్ చేసారని నాకు గుర్తొచ్చింది.

''ఏమ్మా రేషన్ తెచ్చుకోలేదా అని అడిగాను. 'తెచ్చుకున్నాం బాబూ' అంది. 'మరి ఏవి' అని అడిగాను. అయిపోయాయంది. 'అప్పుడేనా?' అంటే ఆమె ఏమందనుకున్నారు? 'లేదు బాబూ. మేం మొత్తం బియ్యం తెచ్చుకోలేదు. బియ్యమంటే మీరు చవగ్గా

ఇస్తున్నారు. తక్కినవి ఎవరిస్తారు. పప్పు కావాలె, ఉప్పు కావాలె. అందుకని కొంత బియ్యం రేషన్‌షాపు ఆయనకే అమ్మేస్తాం' అంది. అంటే ఎవరికనుకున్నారు. ఇదిగో వాళ్లంతా వోటేసి గెలిపించుకున్న ఈ నాయుడిగారికే. అయినా నేను తొందరపడలేదు. సరే కార్డ్ మీద కిరస నాయిలు ఇస్తారుకదా అదన్నా ఎందుకు తెచ్చుకోలేదు. ఈ చీకట్లో ఉండే బాధ తప్పేది కదా అన్నాను. ఆమె అంది కదా, 'ఇప్పటిదాకా కిరసనాయిలు ఎప్పుడూ కార్డ్ మీద తెచ్చుకోలేదు. అసలది ఇస్తారని కూడా తెలీదు,' అంది. నేను నా మండలానికి కిరసనాయిలు లైసెన్సింగ్ ఆఫీసర్ని కూడా అని గుర్తొచ్చింది. నా మండలంలోని అర్హులైన కుటుంబాలన్నిటికీ ప్రతినెలా కార్డ్ మీద కిరస నాయిలు ఇస్తానని రాతపూర్వకంగా ఒప్పుకుంటేనే నేను ఈ నాయుడుగారి భార్యకి కిరసనాయిలు డీలర్‌షిప్ ఇచ్చానని కూడా గుర్తుచేసుకున్నాను. నేను పౌరసరఫరా అధికారిగా బియ్యం అందించలేకపోయాను సరే కిరస నాయిలు కూడా అందించలేకపోయాను. నావల్లనే ఈ ఇంట్లో వెలుతురు లేకుండాపోయింది అని వినిపించ గానే నాకు కోపం వచ్చింది. ఆపుకోలేనంత దుఃఖం వచ్చింది. నా ఉద్యోగంలో వైఫల్యానికి నేను ఎంత మందికి జవాబు చెప్పాల్సి ఉంటుందో అని భయం వేసింది. 'సరే నీ కార్డ్ చూపించు' అన్నాను. ఆ కార్డ్ మీద ఎంట్రీలు చూసైనా తరువాత ఏమి చెయ్యాలో నిర్ణయించుకోవచ్చని.

''కానీ దురదృష్టం నన్ను వెంటాడుతూనే ఉంది. ఆమె అంది కదా, 'ఆ కార్డు నా దగ్గర లేదు బాబూ షాపాయన దగ్గరే ఉంది,' అంది. ఎందుకు ఉంద న్నాను. 'అంతేకద తండ్రీ! కార్డులెప్పుడూ అక్కడే వుంటాయి. నాదే కాదు మా కాలనీలో కార్డులన్నీ అక్కడే ఉంటాయి,' అంది. అంతే ఆ మాట నన్ను పూర్తిగా కూల్చేసింది. నేను ఫెయిలయ్యాను. ఫెయిలయ్యాను అని ఎవరో బిగ్గరగా అరుస్తూ ఊళ్లోంచి పరుగులు పెడుతున్నట్టు అనిపించింది. నాకు మతిస్థిమితం తప్పు తుందేమో అనిపించింది. నేను ఆమెని అట్లానే వదిలేసి వెంటనే జీపు మీద మి-కి పరుగు పెట్టాను. ఆ గ్రామం నుంచి ఫెయిర్ ప్రైస్ షాపుదాకా జీపు మీద పది నిమి షాలకన్నా ఎక్కువ టైంపట్టదు. కానీ నాకు కొన్నివేల మైళ్లు కొన్ని సంవత్సరాల పాటు ప్రయాణిస్తున్నట్టు అనిపించింది. ఏదో ఒక వున్మత్త మనస్థితి ఆవహించింది నన్ను. తెలియని ఒక ప్రతీకారేచ్ఛ నన్ను దహించింది. ఆ తరువాత జరిగినదంతా మీరు విన్నారు. అప్పటి నా ప్రతి కదలికనీ మీరు అనేక కోణాల్లో, అనేక అనుమా నాల్తో పరిశీలించారు. అప్పుడు ఏమి జరిగి ఉంటుందో మీరే నిర్ణయించండి. ఆ విషయం మీద నేను చెప్పవల సింది ఇంతకుముందే పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గారి క్రాస్ ఎగ్జామినేషన్‌ని భరించి మరీ చెప్పాను. ఇక మళ్లీ మళ్లీ దాన్ని తిరిగి తిరిగి చెప్పే ఓపిక లేదు నాకు.

''అవును నిజమే. నేను సరఫరా అధికారిగా నా బాధ్యతలు తెలిసి ఉండటంతో పాటు ఇది కూడా తెలుసుకుని ఉన్నాను. ఈ దేశంలో రాజకీయ ప్రభుత్వ వ్యవస్థలు రేషన్ కార్డులపైననే ఆధారపడి ఉన్నాయని, నా మండలానికి ఏ ఉన్నతాధికారి వచ్చినా, ఏ మంత్రి వచ్చినా, చివరికి ఒక హైకోర్టు జడ్జి వచ్చినా కూడా ట్రావె లర్స్ బంగళాలో మకాం చేసినప్పుడు వాళ్ల బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అన్నీ ఈ రేషన్‌కార్డులే భరించవలసి వుంటుందని నాకు తెలుసు. నేను పూర్తి అర్థంలో సరఫరా అధికారిగా ఉండాలని నేను ఉద్యోగంలో చేరిన తొలిరోజుల్లోనే నాకింది సిబ్బంది నాకు స్పష్టంగా తెలియజేశారు. ఈ సంఘటన అయిన తరువాత నన్ను నా కొలీగ్ ఎమ్మార్వో ఒకాయన వయసులో నాకన్నా పెద్దవాడు, నా పట్ల ఎందుకో తెలియని అభిమానమున్న వాడు అడిగాడు కదా, 'బాబూ అందరికీ తెలిసినవాటిని అందరికీ తెలిసినట్టుగానే భావించి ఊరుకోవచ్చు కదా,' అని. నిజమే అది అందరికీ తెలిసిందే. రేషన్‌కార్డుల మీద బియ్యం పూర్తిగా అమ్మరనీ, బీదవాళ్ల పేరు మీద చాలామంది కలిగినవాళ్లు కూడా దొంగకార్డులు పొంది ఉంటారని, ఒకటో అరో నిజమైన కార్డులు కూడా వున్నా అవి కూడా రేషన్‌షాపులోనే ఉంటాయని, వాటిమీద రేషనంతా ఇచ్చినట్టే నమోదుచేస్తారనీ అందరికీ తెలుసు. కానీ జ్ఞానం చాలా ప్రమాదకరమని అందరికీ తెలీదు. ఆ రాత్రి నా ఉన్మత్తత కొత్తగా ఒక జ్ఞానం కలిగినందు వల్ల వచ్చింది కాదు. అది నాకు ఆసరికే ఉన్న జ్ఞానం, నేను ఏహ్యపడుతున్న ఆ జ్ఞానం, నేను భరించలేని ఆ జ్ఞానం నాకు గుర్తొచ్చినందువల్ల కలిగిన సంక్షోభం. బహుశా నాకు ఆసరికే ఆ జ్ఞానం లేకపోయుంటే, అదే మొదటి సారిగా ఆ విషయాలు తెలియడమే అయి వుంటే మరొక భావమేదన్నా కలిగి ఉండేదేమోగాని నన్ను నిలువెల్లా దహించిన ఆ ప్రతీకారేచ్ఛ మాత్రం కలిగి ఉండేది కాదు. ఆ ప్రతీకారం కలిగింది ఒక చౌక దుకాణం డీలర్ మీద కాదు. నా మీద, నా జ్ఞానం మీద, నా జ్ఞానంవల్ల నాలో కరప్షన్ మీద కలిగిన ప్రతీకారం అది.''

ఆపుకోలేని ఉద్వేగంలో మాట్లాడిన మాటల వేగానికి మోహనచంద్ర ఒక్క క్షణం ఆగాడు. ఆ విరామంలో కోర్టు టైపిస్ట్ టైప్‌సెట్టర్ మీద కాగితం కార్బన్ మార్చుకున్నాడు. కోర్టు హాలు నిశ్శబ్దంగా వింటోంది. అతడు మళ్లీ మొదలుపెట్టాడు.

"కానీ నేను ఇప్పుడు ఆ విషయాలు ఆలోచించడంలేదు. నేను ఆ రాత్రి చౌక దుకాణాన్నే తనిఖీ చేశానని, దొంగకార్డులు పట్టుకున్నానని, రైస్ ఎక్సెస్ స్టాక్ సీజ్ చేసాననీ, డీలర్‌షిప్ రద్దు చేయడానికి నోటీస్ ఇచ్చానని ఇంతకుముందే మీకు చెప్పుకున్నాను. ఈ అంశాలు ఎలాగూ జాయింట్ కలెక్టర్ రెవెన్యూ కోర్టులో విచారిస్తారు. కానీ నేను ఆలోచిస్తున్నది తనను రక్షించుకోవడానికి ఈ ఎంపిపి మరొక మార్గమేమీ వెదుక్కోకుండా ఇటువంటి కేసు ఎందుకు పెట్టాడా అన్నదే. అతని షాపులో దొంగ కార్డులుంటాయని అందరికీ తెలిసిందే కదా! నేను తనిఖీ చేసి రుజువు చేసినందువల్ల అతని గురించి సంఘానికి కొత్తగా తెలిసేదేముంది? అతని ప్రతిష్ట ఏ విధంగా దెబ్బతింటుంది? అందరికీ తెలిసిందే మరోసారి చెప్పారు. చివరికి అతన్ని సమర్థిస్తూ, నన్ను ఏకిపారేస్తూ పత్రికలకు వార్తలు పంపిన స్ట్రింగర్లకు కూడా తెలుసు ఇవన్నీ. నెల తిరగ్గానే వాళ్లకి అందే బియ్యం ఆ షాపునించే కదా తరలివెళ్లేది. అయినా వాళ్లంతా నా ప్రతిష్ట మీద ఎందుకు దాడిచేశారు? అది కూడా ఎంత ఏహ్యమైన పద్ధతిలో? నా మెడలు వంచడానికి ఈ రాజకీయ నాయకుడు తన భార్య పేరు రోడ్డు మీదకు లాగడానికి సైతం ఎందుకు వెనుకాడలేదు? ఇదే నన్ను శల్యంలా బాధిస్తున్న ప్రశ్న. దీని గురించే నేను మరికొంత చెప్పాలనుకుంటున్నాను."

## 3

"మీరు నా మీద వచ్చిన అభియోగాన్ని విచారించడానికి కూర్చున్నారు. మీ శిక్షాస్మృతులు ఏ పద్ధతిని పాటించాలంటున్నాయో ఆ మార్గంలో మీరు విచారణ చేస్తారు. ఒక నిందితుడు నేరానికి పాల్పడ్డాడా లేదా అనడానికి మీరు చేసేదేమిటి? ముందు అతని ఇంటెన్షన్ని, ఆ తరువాత మోటివ్‌ను, అప్పుడు అది ఎటువంటి చర్యగా రూపుదాల్చిందో ఆ చర్యని, అంతేకదా! ఒక చర్య దానికదే నేరం కాదనీ, దాని నేపథ్యంలో ఒక క్రిమినల్ ఇంటెన్షన్, ఒక క్రిమినల్ మోటివ్ ఉంటేనే అది నేరమౌతుందనీ మీకు మీ లా కాలేజీలోనే చెప్పి ఉంటారు. ఇందులో ఎవరన్నా కళ్లతో చూసేది బయట జరిగిన దాన్నే. అంటే చర్యనే. కానీ దానివెనుక ఉండే అదృశ్య శక్తుల్ని, ఆ సంకల్పాల్ని, ఆ ప్రేరణల్ని తక్కినవాళ్లు కళ్లతో చూడలేరు. ఈ ఇన్వెస్టిగేటింగ్ అధికారులు కూడా చూడలేరు. వాళ్లు మీ ముందు ఉంచిన సమాచారం మేరకు మీరు వాటిని కనుగొంటారు. అలా కనుగొనడానికే మీకు శిక్షణ ఇచ్చారు. అంటే మీరు మీ చదువు, మీ ట్రైనింగ్, మీ సర్వీసు అన్నీ ఆధారంగా ఇప్పుడు ఏమి కనిపెట్టాలి?

"ఆ రాత్రి నేను తట్టిన తలుపు చౌకదుకాణం గదిదా లేక పక్కనున్న రామినాయుడిదా? నేను ఆ గడపలో అడుగుపెట్టినపుడు టైం ఎనిమిది గంటలా లేక ఎనిమిదిన్నరా? కరెంటులేని ఆ రాత్రి, ఆ వర్షంలో, ఆ చీకట్లో నేను ఏ తలుపు తట్టానో, ఎన్ని గంటల ఎన్ని నిమిషాలకు అక్కడ అడుగుపెట్టానో నాకే తెలియనప్పుడు మీకెలా తెలుస్తుంది? మీరు అక్కడ లేరు. మీకు నా ఇప్పటి మనఃస్థితే తెలియదు.

"అప్పటిది ఎలా తెలుస్తుంది? అప్పటి నా సంకల్పాల్ని, నా ప్రేరణల్ని మీరెలా అంచనా వెయ్యగలుగుతారు? అంటే మీరు కాలంలో వెనక్కి ప్రయాణించి అప్పటి క్షణాన్ని ఉన్నదున్నట్టుగా పట్టుకోవాలి. అప్పుడు కూడా ఆ యథార్థాన్ని మీరు ఏ విధంగా గ్రహిస్తారో అది మటుకే న్యాయశాస్త్రం అంగీకరించే సత్యం అవుతుంది. మీరంతా ఎంతగానో ఆరాధించే భారతీయ సాక్ష్యాధార చట్టం ఏం చెప్తుంది? ఏ యథార్థమైనా దానికదే ఒక సాక్ష్యంకాదు. దాన్ని కోర్టు అంగీకరించినప్పుడే అది సాక్ష్యమౌతుందని. అంటే నా అప్పటి మనఃస్థితి ఇలా ఉంది అని నేను చెప్పినా దాన్ని మీరు అంగీకరించాలని లేదు. అది మీరెలా ఉందని భావిస్తారో అది మటుకే కోర్టు దృష్టిలో సత్యంగా నిరూపణ అవుతుంది. ఈ తర్కం నమ్మదగ్గదేనా?

"మీరు పొద్దున్నే లేచి, కొద్దిసేపు మార్నింగ్‌వాక్ చేసి, ఆపైన న్యూస్‌పేపర్లు చదువుకుని తాపీగా బ్రేక్‌ఫాస్ట్ చేసి, కోర్టుకు హాజరై, ఇక్కడ కూచుని విన్నదాన్ని బట్టి మీ జీవితానుభవంతో నిమిత్తం లేని, మీ ఊహకు కూడా అందని సంఘటనల్లోకి ప్రవేశించి, కాలంలో వెనక్కి వెళ్లి, నిందితుడి మనసులోకి చొరబడి సత్యాన్ని కనుగొనాలి. ఇంతకన్నా ఫిక్షన్ ఉంటుందా? పోనీ ఇదంతా సాధ్యమే అనుకొందాం. అయినా కూడా సత్యం ఒక నిశ్చల క్షణంలో బోధపడేదే అయితే, మీరు ఈ క్షణాన ఆ సత్యాన్ని బోధపరుచుకుంటున్నపుడు మీరు ఎంత నిశ్చలంగా ఉండాలి? మీ అంతరంగంలో ఆ సత్యం ప్రతిఫలించేటప్పుడు మీరు నిర్మలమైన నీళ్లలాగా, ఏ

చిన్నపాటి కదలిక, ఏ చిన్న అల కూడా రేగకుండా వుండాలి కదా! అలాకాక మీరు పొద్దున్నే వేడివేడి దోశలు టిఫిన్ చేసివచ్చినట్లయితే, ఆ అట్లపిండి మీ జీర్ణకోశంలో మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తుంటే మీకు ఇష్టం లేకపోయినా కునికిపాట్లు పడేలా చేస్తుంటే మీరు ఆ సత్యాన్ని మీలో ప్రతిఫలించుకోగలరా.''

చివరి మాట వింటూనే లాయర్లలో ఒకతను నవ్వు ఆపుకోలేక ఫక్కున నవ్వాడు. ఆ నవ్వు వింటూనే మాజిస్ట్రేట్ ముఖంలో అసహనం తొంగిచూసింది. ఆ నవ్వు వినగానే వెనుకనున్న వాళ్లు ఏమి జరిగిందో అర్థం కాక ఎమ్మార్వో మాటలు సరిగా వినబడక ఆతృతగా ముందుకు కదిలారు. ఈలోగా నవ్వకుండా ఉండలేక పోయిన లాయర్ తన నవ్వు కోర్టు ధిక్కారం చేసిందన్న భయంతో మాజిస్ట్రేట్ కేసి చూస్తూ మూడుసార్లు తల వంచి మౌనంగానే క్షమాపణ కోరుకున్నాడు. రెండు మూడు నిముషాల కలకలం సద్దుమణిగాక మోహన చంద్ర మళ్లీ మొదలుపెట్టాడు.

''క్షమించాలి. నా ఉద్దేశ్యం తమని అగౌరవ పరచడం కాదు. ఒక మండల రెవెన్యూ అధికారిగా నేను మండల ఎగ్జిక్యూటివ్ మాజిస్ట్రేట్‌ని కూడా. నేను కూడా సివిల్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్లలో, ఎవిడెన్స్ యాక్ట్‌లో డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు పాసయ్యాను. ప్రతి శనివారం నేనుకూడా రెవెన్యూ కోర్టు పెడతాను. మిమ్మల్ని అడుగు తున్న ప్రశ్నలు నన్ను నేను బాహాటంగా అడుగుతున్నట్టు గా భావించండి. ఒక మాజిస్ట్రేట్‌గానే ఉన్న నేను ఈ కేసు వల్ల ఒక నిందితుడిగా మారాను. ఇప్పుడు నాకు నిందితుడి మనఃస్థితి ఏమిటో అర్థమైంది. కానీ మీకు మాజిస్ట్రేట్ మనఃస్థితి మాత్రమే తెలుసుగానీ ఒక నిందితుడి ఆత్మవేదన అర్థంకాదు. న్యాయశాస్త్రపు ఏ ప్రొసీజర్ ప్రకారం కూడా మీకు ఈ మనఃస్థితి అర్థం అయ్యే అవకాశంలేదు. మీరు దీన్ని అర్థం చేసుకోవా లంటే మీమీద కూడా ఒక అభియోగం మోపబడి వుండాలి. కానీ అప్పుడు మీరు ఆ అభియోగం మేరకు మాజిస్ట్రేట్ కాకుండాపోతారు. అంటే మీకు ఒక జీవిత కాలంలో ఎన్నడూ అనుభవానికి రాని ఈ మనఃస్థితి వున్నవారిని అనునిత్యం మీ ఎదుట పెట్టుకుని మీ విధి నిర్వహణ చేస్తున్నారు. ఇది సమంజసమేనా?

''సరే. నా ప్రస్తుత అంశం అదికాదు. నేను చెప్ప దలుచుకున్నదల్లా జరిగిన ఒక సంఘటనలోని సత్యాన్ని మీరు కనుగొనడం అసాధ్యమని. కానీ ఈ అసాధ్యం సాధ్యమనే లీగల్ ఫిక్షన్ మీదనే ఈ వ్యవస్థ అంతా ఆధారపడి ఉంది. ఆ భాషని మీతోపాటు ఈ ప్రాసి క్యూటరూ, మా లాయరూ కూడా చదువుకున్నారు. ఇక తేలవల్సిందల్లా ఆ భాషని ప్రాసిక్యూటర్ బాగా ఉప యోగించగలడా లేక నా లాయర్ బాగా ఉపయోగించ గలడా అన్నదే. ఇంతవరకూ నా తరఫున వాదించిన నా లాయర్ జరిగిన సంఘటనను మీకు అర్థమయ్యే భాషలో ఏ విధంగా చెప్పుకొచ్చాడో వింటే మీకన్నా నాకెక్కువ ఆశ్చర్యమేసింది. ఆయన తన ఆర్గ్యు మెంటులో ఎక్కువగా మెన్స్‌రియా గురించి ప్రస్తావిం చాడు. దాన్ని గురించి నేను నా పరీక్షల్లో చదివిందే తప్ప ఎక్కువ ఎప్పుడూ ఆలోచించలేదు. ఆయన ఇప్పుడు దాన్ని నాకు వర్తింపచేస్తున్నాడు. ఆయన అన్నదేమిటి? ఒక మనిషి ఒక కర్మ చేసినప్పుడు అది నేరమవుతుందా కాదా అన్నది ఆ కర్మ వెనుక నేర ప్రవృత్తి ఉందా లేదా అన్న దాన్ని బట్టి నిర్ధారించాలని కదా! అంటే ఆ రాత్రి నేను ఆ దుకాణం మీద రెయిడ్ చేసినప్పుడు నిజంగా నేను ఆమె చెయ్యి పట్టుకున్నానో లేదో ఎవరూ చూడ లేదు. ఈ ఫిర్యాదీ కూడా అప్పుడు చీకటిగా ఉందనీ, వాస్తవంగా ఏమి జరిగిందో తాను కూడా చూడలేదనీ, కాకపోతే తన భార్య ఏడుస్తున్నందువల్ల ఆమె గౌరవాన్ని భంగం చేసేదేదో నేను చేసి ఉంటాననీ అన్నాడు. ఇక కేసు అంతా నేను చౌక దుకాణం తలుపు తట్టానా, లేక ఆ ఇంటి తలుపు తట్టానా అన్నదాని మీదా, అలాగే దుకాణం పనిగంటల్లో తనిఖీ చేశానా, పనిగంటల తరువాత తనిఖీ చేశానా అన్నదాని మీదే నడిచింది. నా లాయర్ ఏమన్నాడు? ఒకవేళ నేను పనిగంటలు అప్పుడే ముగుస్తుండగా తనిఖీకి వెళ్లినా అలాగే దుకాణంలోకి ప్రవేశించబోయి పొరపాటున ఇంట్లో ప్రవేశించి ఉన్నా అక్కడ మెన్స్‌రియాని కూడా పరిగణిం చాలనీ, ఆ విధమైన నా చర్యల వెనుక నా విధి నిర్వహణే ముఖ్య ఉద్దేశ్యం తప్ప నేరం చెయ్యాలన్న ఆలోచన కాదనే కదా! ఆ రకంగా నేను క్రిమినల్ లయ బిలిటీకి బయట ఉన్నానని వాదించడమే కాకుండా, 1965లో కేసు ఒకటి ఉదహరిస్తూ అబ్సొల్యూట్ లయబిలిటీ అన్నది తేలిగ్గా ఊహించేదికాదనీ, పూర్తిగా నిర్ధారించగలిగితే తప్ప ఒక నిందితుడిని క్రిమినల్ అనలేమనీ అన్నాడు కదా.

''నా లాయర్ వాదనలు వింటున్నంతసేపూ మీ ముఖంలో ఒక అద్వితీయమైన ఆనందాన్ని చూశాన్నేను. అది ఎటువంటిదంటే ఒక పరదేశంలో ఉంటున్నప్పుడు మన భాష మాట్లాడగలిగినవాడు ఒకడు కనబడటమే

కాకుండా అతడు మన మాతృభాషని అద్భుతంగా మాట్లాడుతున్నపుడు మనకు కలిగే సంతోషం. అంతే కాదు. తను క్లాసులో చెప్పిన పద్యాల్ని కుర్రవాడు తిరిగి అప్పగించడమే కాకుండా అక్కడక్కడ సొంత వ్యాఖ్యానం కూడా చెయ్యగలిగినప్పుడు టీచరు పొందే ఆనందం. ఏ రూపంలో అయినా అది ఒక అరుదైన స్పీషిస్ తను అంతరించట్లేదు అని తెలుసుకున్నప్పుడు ఆ జాతి మొత్తంగా పొందే ఆనందం. దాన్ని ఆరోజు మీలో చూశాను.

''ఆ సాయంకాలం నా కొలీగ్స్ చెప్పారు. 'మన లాయర్ అదరగొట్టేసాడు. తీర్పు నీకు అనుకూలంగా రావడం ఖాయం,' అని. కానీ ఆరోజు నుంచే నిజంగా నా వేదన మొదలైంది. అంతదాకా నేను పడ్డది సాంఘిక మైన వేదన. అంటే పత్రికలు నామీద రాసిందానికి నా సోషల్ రెప్యుటేషన్ సఫర్ అయినందువల్ల కలిగిన బాధ. నా చిన్ని జీవితానికి ఇది పెద్ద దెబ్బే అయినా దాన్నించి కోలుకోగలను. కానీ నా లాయర్ వాదనలు విన్నరోజు నుండీ నాకు ఆత్మవేదన మొదలైంది. నేను దీన్నించి అంత త్వరగా కోలుకోగలననుకోను. ఇంతకీ నా లాయర్ వాదనల్లో అన్ని మాటలూ కావు, ఆ రెండు మాటలే, ఒకటి మెన్స్‌రియా రెండోది అబ్సొల్యూట్ లయబిలిటీ అన్నవి. ఆ రెండు మాటలే, నన్ను బయట పడెయ్యడానికి ఆయన వాడి ఆ మాటలే, నన్ను ఎప్పటికీ బయటపడలేనంత అగాధంలోకి తోసేశాయి. అంటే నిజంగా ఆ క్షణంలో నా మనఃస్థితికి మెన్స్ రియాని వర్తింపచెయ్యవచ్చా? నా సంకల్పాల్లో ఏ విధ మైన నేరస్వభావం లేనేలేదా? ఒకవేళ ఆ దురదృష్టకర సాయంకాలం, ఆ హరిజనవాడలో, ఆ నిర్భాగ్యులైన ఆ తల్లీకూతుళ్లను నేను చూసినప్పుడు నేను ఒక ఎమ్మార్వోని కాకపోయుంటే ఆ తరువాత నేను చేసిన పనులు నిజంగా చేసి ఉండేవాణ్ణా? అంటే ఒక వ్యక్తిగా నా చర్యలు క్రిమినల్ లయబిలిటీ నుంచి తప్పించు కున్నప్పటికీ నాలోని అధికారి ఆ బాధ్యత నుంచి తప్పించుకోగలడా? ఈ కేసులో మీరు నన్ను వ్యక్తిగా విచారిస్తున్నారు. కానీ ప్రశ్నించబడ్డ, అనుమానించబడ్డ ఆనా చర్యలు వ్యక్తిగా నేను చేసినవికావు. నాలోని అధి కారివి. అలాగే ఈ రామినాయుడు నామీద మోపిన అభియోగం కూడా నా వ్యక్తిమీద అనుకోను. నాలోని వ్యక్తి తను నిర్వహిస్తున్న ఒక అధికారపాత్ర నీడన చేసిన ఒక పని మీద ఫిర్యాదు అది. కానీ ఆ మనఃస్థితిలో మరొక మనఃస్థితి ఉంది. అది నాలోని అధికారి మనః స్థితి. దాన్ని కూడా మీరు అర్థం చేసుకోవడానికి ప్రయ త్నించాలి. అప్పుడే నేను అబ్సొల్యూట్ లయబిలిటీ నుంచి మినహాయింపు పొందగలనో లేదో పరిశీ లించాలి.''

కోర్టు హాల్లో తెలియని ఒక విసుగు చోటు చేసు కుంది. బయట ఎండ ఎక్కుతున్నకొద్దీ కిక్కిరిసిన కోర్టు గదిలో ఉక్కపొయ్యడం మొదలయ్యింది. మోహన చంద్ర విన్నపం న్యాయ పరిభాషలోకి మారినందువల్ల హాల్లోని నిరక్షరాస్యులైన సాక్షులూ, శ్రోతలూ విసుగు దలను నెమ్మదిగా దగ్గడం ద్వారా, అసహనంగా కద లడం ద్వారా సూచించడం మొదలుపెట్టారు. మోహన చంద్ర లాయర్ మొహంలో ఒక ఆశ్చర్యార్థకం కనబ డింది. తన క్లయింటు ఏమి మాట్లాడబోతున్నాడు? ఇంతదాకా ఎంతో అవస్థపడి తను ఎంతో పకడ్బందీగా నిర్మించి నెట్టుకొచ్చిన ఆర్గ్యుమెంటును ఇప్పుడీ పిల్ల వాడు అనుభవరాహిత్యంతో ఎటు నెట్టుకుపోతున్నాడు. అతనికి తను మధ్యలో ఇంటరప్ట్ చెయ్యాలా వద్దా అన్న మీమాంస కలిగింది. మాజిస్ట్రేటువైపు చూశాడు. ఆయన నిర్వికారంగా వింటున్నాడు. కొందరు కొండలు పిండిచేసి బ్రతుకుతారు. కొందరు పంటలు పండించి. కొందరు గనులు తొలిచి. కొందరు రైలింజన్లో బొగ్గువేసి. అలాగే మాజిస్ట్రేట్ కోర్టు పనిగంటల్లో మాటలు వినడమే పనిగా బతుకుతాడు. అందులో కష్టం చూడడు ఆయన. అది అతని జీవనాధారం. ఒక తలారి పొద్దున్నే ఒక నేరస్థుడికి శిరచ్ఛేదం చేసి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి పోయినంత నిర్వికారంగా మాజిస్ట్రేట్ వదనం ఉంది. ఆయన్ని చూసి తక్కినవారు కూడా నిందితుడు తరువాత చెప్పబోయే మాటల్ని వినడానికి అసంకల్పితంగా చెవొగ్గారు. ఆ యువకుడు మళ్లీ మాట్లాడడం మొదలుపెట్టాడు.

## 4

''నాలోని వ్యక్తికీ అధికారికీ మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలంటే నేను ఈ ఉద్యోగంలోకి రాకపూర్వం నా జీవితం ఎలా ఉండేదో కూడా మీరు కొంత తెలుసు కోవాలి. నేను యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో ఎమ్మే చేశాను. 'ది స్టేట్ అండ్ ఎలియనేషన్' అన్న అంశం పైన ఎం.ఫిల్ కూడా చేసాను. ఆపైన పి.హెచ్.డి చేసి ఒక ఉపాధ్యాయుడిని కావాలనుకున్నాను. కానీ నా కుటుంబ పరిస్థితులు నన్ను ఏదో ఒక ఉద్యోగం ఎంచుకోక తప్పని పరిస్థితిని కల్పించడంతో సర్వీస్ కమీషన్ పరీక్షలు రాసి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపిక

య్యాను. తీరా నేను ట్రైనింగ్‌కి వెళ్లేటప్పటికి అక్కడ అప్పటిదాకా లెక్చరర్లుగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నవారు కూడా ఆ ఉద్యోగాలు వదిలిపెట్టి నాలాగా డిప్యూటీ తహసీల్దార్లుగా చేరారు. అటువంటి ప్రిఫరెన్స్ నా ఊహకి అందని విషయం. ఆ మాటే వాళ్లతో అంటే నవ్వేశారు. 'ముందు ముందు నీకే తెలుస్తుందిలే,' అనేశారు. నేను ఒక పల్లెటూరు నుంచి వచ్చినవాడిని. నా చిన్నతనంలో ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో కూడా మాటాడి ఎరగను. నా తండ్రి ఒక రైతు. రెవెన్యూ ఉద్యోగులంటే ఆయన దృష్టిలో చాలా పెద్దవాళ్లు. అది కేవలం పన్నులు వసూలు చేసేవారి పట్ల ఒక గ్రామీణ రైతుకుండే భయం మాత్రమే కాదు. అసలు రాజు అంటే గ్రామాల్లో ఉండే ఒక అస్పష్టమైన భక్తిభావం లాంటిదేదో రెవెన్యూ ఉద్యోగుల పట్ల ఆయన తనకు తెలియ కుండానే వెలిబుచ్చే వాడు. అటువంటిది నేను ఒక చిన్న తహసీల్దారుగా ఎంపిక అయ్యానని తెలిసినప్పుడు ఆయన నమ్మలేకపోయాడు. నాలాంటి కొడుకుని కన్నందుకు ఆయన గర్వించడమే కాక, తన పొరుగు రైతులు తన అదృష్టాన్ని ప్రశంసించినందుకు మరింత గర్వించాడు.

''నా ట్రైనింగ్ పూర్తి చేసుకుని నేను మొదటి సారిగా నా ఆఫీస్ కుర్చీలో కూర్చున్నప్పుడు నాకు ఒక రకమైన సంతోషం కలిగింది. అది కొత్తగా ఒక ఉద్యోగ భద్రత పొందినందువల్ల కలిగే సంతోషం వంటిది కాదు. అంత కన్నా భిన్నమైనది. దాని స్వభావాన్ని అప్పట్లో నేను గ్రహించలేక పోయాను. అలాగే ఒక భయంలాంటిది కూడా కలిగింది. అప్పటి నా ముఖంలో ఏ భావం కన బడిందోగాని ఆ ఆఫీసులో పనిచేస్తుండే ఒక సీనియర్ గుమాస్తా నన్ను చూసి, 'మరేం భయం లేదు సార్. మీకు మొత్తం కుర్చీ నేర్పుతుంది. తొందర్లో మీరే మాకు గైడెన్స్ ఇస్తారు' అన్నాడు. కుర్చీ నేర్పుతుందనే ఆ మాట ఇప్ప టికీ నన్ను వెన్నాడుతూనే ఉంది. అతను కుర్చీ నేర్పు తుందని ఏ అర్థంలో అన్నాడోగాని తొందర్లోనే అది నా గురువుల్ని, మిత్రుల్ని, హితైషులందర్నీ పక్కకు తోసేసి నన్ను అంతగా శాసించగలదని నేను ఊహించలేదు. బహుశా అతను తన జీవితానుభవం మీంచి గ్రహించిన సారాంశం అదేనేమో. ఏమన్నాగానీ తొందర్లోనే నేను గుర్తించిందేమంటే కుర్చీ నన్ను భరించట్లేదని, నేనే దాన్ని మోస్తున్నానని.

''ఉద్యోగ జీవితంలో, నా తొలి సంవత్సరాల్లో నేను రెండు రకాల ఆనందాల్ని పొందాను. ఒకటి నా ఉద్యోగ బాధ్యతల మహత్వాన్ని తలచుకొని పొందిన ఆనందం. అంటే నేను ఎవరికన్నా ఏదన్నా చెయ్యగలిగే అవకాశం ఉందన్న ఆనందం. రెండోది అంతకన్నా వేరేది. దాన్ని అంత సులభంగా వివరించలేను. అది ఎటువంటిదంటే నా చుట్టూ ఉన్నవాళ్లకి నేను ఏదో ఒకవిధంగా పట్టించుకోవాల్సిన స్థితిలో అంటే ఇంగ్లీష్‌లో మేటర్ కావడమంటామే ఆ రకంగా ఉన్నానని తెలిసి నందువల్ల కలిగే ఆనందం. అంటే నేను నా చుట్టూ వున్నవాళ్ల మీద ఏదో ఒక రకంగా నా నిర్ణయాల్తోనో అభిప్రాయాల్తోనో ప్రభావం చూపే స్థితిలో ఉన్నానని తెలిసినందువల్ల కలిగే ఆనందం. ఒక మనిషికి తన అస్తిత్వం ఆరకంగా నిర్ధారణకి రావడంలో ఒక విచిత్ర మైన సంతోషం ఉంది. అది నాకు చాలా చిన్న వయసు లోనే కలిగింది. అందువల్ల అది నా తలకి ఎంతగా ఎక్కిందంటే నేను లేకుండా ప్రపంచం నడుస్తుందా అని పించేంతగా అది నన్ను ఆవహించింది. ఇలా నా ఆత్మ కథని ఎంతసేపైనా చెప్పవచ్చుగానీ అసలు విషయానికి వస్తాను.

''నా తొలి పోస్టింగ్ వచ్చిన ఊళ్లో మొదట్లో కొన్నాళ్లపాటు నేను హోటల్ నుంచి కారియర్ తెప్పించు కుని భోజనం చేసేవాణ్ణి. కొన్నిరోజులకి నా డ్రైవర్ ఒక మనిషిని వెంటబెట్టుకుని నా దగ్గరకు వచ్చాడు. 'సార్ ఇతను మావాళ్లకి తెలిసినవాడు. ప్రస్తుతం ఏ ఆధారం లేకుండా ఉన్నాడు. వంట బాగా చేస్తాడు. తమరికి హోటల్ తిండితో సుఖం లేదు. ఇతణ్ణి తమ దగ్గర పెట్టు కుంటే మీకు వండిపెడతాడు' అన్నాడు. తిండి సుఖాన్ని స్తుందన్న మాట ఆరోజే విన్నాను. ఆ మనిషి చాలా అర్భకంగా ఉన్నాడు. జీవితంలో పూర్తిగా కృశించినవాడి లక్షణాలు అతనిలో పూర్తిగా ఉన్నాయి. అతని చొక్కా మాసి చెమట కంపు కొడుతోంది. మామూలుగా అయితే అతగాణ్ణి నేను వెంటనే తిప్పి పంపించెయ్యాలి. కాని బహుశా నా డ్రైవర్ హోటల్ తిండితో సుఖం లేదని అన్న మాట నన్ను ఎక్కడో లోపల్లోపల ప్రలోభపరిచి వుండాలి. నేను సరే అన్నాను. ఆ మనిషి, అతని పేరు చయనులు- ఆ మధ్యాహ్నామే వంట మొదలుపెట్టాడు. అతడు నా దగ్గర కొద్దిగా డబ్బు తీసుకుని దుకాణానికి వెళ్లి ఒక స్టవ్, కొన్ని వంటపాత్రలు వగైరా కొని తీసుకు వచ్చాడు. నేను లంచ్‌కి ఇంటికి వచ్చేటప్పటికి వేడివేడి అన్నం వడ్డించాడు. నా డబ్బుకి ఖర్చు లెక్కరాసి చూపిం చాడు. నాకు సంతోషం కలిగింది. నా పనులేవో నేను పట్టించుకోనక్కర లేకుండా, పెద్దగా ప్రతిఫలం ఆశించ

కుండా ఎవరో ఒకరు చూసుకోడానికున్నారన్న ఆలోచన వల్ల కలిగిన హాయి అది.

"ఆ మధ్యాహ్నం నేను గమనించిందీ, ఆ రాత్రి భోజనం వేళ నేను గమనించిందీ ఒకటి ఉంది. కావడానికి అది చిన్న పరిశీలనే కాని చాలా ముఖ్యమైంది. అదేమంటే అతడు నేను అన్నం తింటున్నంతసేపూ తలుపు పక్కన నించునే ఉన్నాడు. అతడు మాట్లాడేటప్పుడు కూడా నా ఎదుటపడి సాహసంగా మాట్లాడలేదు. ఆ భంగిమలు నాకెందుకో నా చిన్ననాటి గ్రామాల్లో స్త్రీలు, ముఖ్యంగా దిక్కులేని వితంతువులు, వాళ్ల బంధువుల ఇళ్లల్లో వండిపెట్టి బతికే ఆడవాళ్ల కదలికల్లాంటివేవో అతడిలో కనబడ్డాయి.

"అతడు వచ్చిన రెండో రోజునో మూడోరోజునో ఒక చిన్న సంఘటన జరిగింది. ఆరోజు నేను మామూలుగా పోయేట్టుగా చెప్పుల్తో బయటకు పోకుండా షూస్ వేసుకోవాల్సి వచ్చింది. ఇంట్లో అటకపైన పెట్టిన బూట్లు నా చేతికి అందక అతన్ని తియ్యమన్నాను. అతడు పైకి ఎక్కి ఆ బూట్లు తీసి అంతటితో ఆగక వాటిని పాలిష్ చెయ్యడం మొదలుపెట్టాడు. నేను అతణ్ణి వారించబొయ్యానుగాని ఫలితం లేకపోయింది. ఆరోజు నా పని ముగించుకుని ఇంటికి వస్తుండగా అతడు పొద్దున్న నా బూట్లు పాలిష్ చేసిన దృశ్యం కళ్లముందు కదిలింది. నా మొదటి ఫీలింగ్‌లో ఒక రకమైన గిల్టీనెస్ ఉంది. కానీ దానిలోపల రహస్యంగా మరేదో ఒక ఫీలింగ్‌ని నేను ఎంజాయ్ చేస్తున్నట్టు కనిపెట్టాను. నన్ను నేను నిశితంగా చీల్చి చూసుకుంటే నాకు తెలిసింది కదా, అయ్యా మాజిస్ట్రేట్‌గారూ, మీరు ఆశ్చర్యపడకండి. నేను చెప్తున్నది నిజం, అతడట్లా నా షూస్ పాలిష్ చేసినప్పుడు నాకు నిజంగా కలిగింది ఆనందం. నమ్మండి. నేను ఆనందపడ్డాను. అది ఎటువంటిదంటే బహుశా పూర్వ కాలాల్లో తనకంటూ ఒక బానిసని మొదటిసారిగా సంపాదించుకున్న యజమాని అటువంటి సంతోషాన్ని పొంది ఉంటాడు. అప్పుడు నేను మంచం మీద కూచుని వుండగా అతడు నా ఎదట ఆ బూట్లని ఎంతో జాగ్రత్తగా పట్టుకుని తదేక ధ్యాసతో బ్రష్‌తో పాలిష్ చేస్తుంటే పైకి వద్దువద్దు అంటున్నా నాలో ఒక కొత్త సంతోషమేదో ఊరిందని చెప్పనివ్వండి.

"అతడు తొందర్లోనే నా దైనందిన జీవితంలో విడదీయరాని భాగమైపోయాడు. ఆఫీసులో నా కుర్చీలాగా ఇంట్లో అతడు కూడా నన్ను నాకు తెలియకుండానే శాసించడం మొదలుపెట్టాడు. రెండుచోట్లా కూడా నేను ఒక విచిత్రమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఉన్నాను. అంటే నేను ఎక్కడికి వెళ్లినా అక్కడ నా ఎదట ఒకరో ఇద్దరో మానవులు తలవంచి నా ఆజ్ఞలు స్వీకరించడానికి సిద్ధంగా ఉంటారన్న ఒక ఫీలింగ్. అది మీకు ఇచ్చే మత్తు ఏమిటో నేను మాటల్లో వివరించలేను. కానీ ఈ మత్తు కేవలం మనం మనుషుల్ని ప్రభావితం చెయ్యగలమని తెలిసినందువల్ల మాత్రమే కలిగేది కాదు. ఇలా కవులు, కళాకారులు, నేతలూ, ప్రవక్తలూ కూడా ప్రభావితం చెయ్యగలరు. కానీ వారికన్నా భిన్నమైంది ఇది అని నాకు మరో సంఘటన ద్వారా తెలిసింది.

"ఆరోజు నేను ఎలక్షన్లు నిర్వహించి ఉన్నాను. అది చాలా టెన్షన్తో కూడి ఉన్న పనే కాక సాయంకాలమయ్యేటప్పటికి శారీరకంగా కూడా చాలా అలిసిపోయాను. వళ్లు నొప్పులుగా ఉంది. ఇంటికి వచ్చి అలసటగా పడుకున్నాను. తెల్లవారితే పని. తప్పించుకోలేను. కానీ అలసట. అప్పుడు చయనులు నా దగ్గరిగా వచ్చి, 'ఏమయ్యా, అట్లా పడుకున్నారు?' అని అడిగాడు. కాళ్లు నెప్పులుగా ఉన్నాయని చెప్పాను. అప్పుడతడు, 'కాళ్లు పిసుకుదునా సార్,' అన్నాడు. ఆ మాట విన్న ప్పుడు కూడా, 'అయ్యో అయ్యో వద్దు వద్దు,' అన్నానే కాని కాళ్లు పట్టించుకుంటే నొప్పులు తగ్గుతాయన్న ఆలోచన ఎందుకు రాలేదా అని లోలోపల అనుకున్నాను. అతడు నా మాటలు పట్టించుకోకుండా కొబ్బరినూనె తీసుకువచ్చి నా పాదాలు తన ఒళ్లో పెట్టుకుని మర్దించడం మొదలుపెట్టాడు. ఆరోజు నా బూట్లని, ఈరోజు నా పాదాల్ని అతడు పట్టుకున్న తీరు ఒక పూజారి దేవతావిగ్రహాల్ని శుభ్రం చేసేటప్పుడు పట్టుకునే చందంలో ఉంది. కానీ ఆ సేవ నాలోని ఏ దైవీ గుణాల్ని కూడా బయటకు తేకపోగా నేను ఒక యజమానిగా అతడు ఒక సేవకుడిగా ఒక మానవ సంబంధంలో పూర్తిగా ప్రవేశించినట్టయ్యింది. అంతేకాదు ఒక యజమానిగా నాకు తెలియకుండానే నా సేవకుడి జీవితం మీద నేను చూపిస్తున్న ప్రభావం అతని కాయాన్ని నా శారీరక స్వస్థత కోసం ఉపయోగించుకునేదాకా విస్తరించింది. నేను ఒక ఉన్నతవిద్యని అభ్యసించిన విద్యార్థిని. కానీ నా ప్రభుత్వ ఉద్యోగం వల్ల నేను ఒక యజమానిగా మారాను. నన్ను పోషించుకోవడానికి సంఘం నాకు ఇచ్చిన భృతిలో నుంచి కొంత ఖర్చు చేసి నేను జీవితంలో మొదటిసారిగా మరొక మానవుడిని నా పనివాడిగా మార్చుకున్నాను. అక్కడితో

ఆగక అతని చేతుల్తో నా కాళ్లు పట్టించుకున్నాను. కానీ ఈ కథ ఇక్కడితో ఆగలేదు. ఇందులో ఉన్నది కేవలం సేవ్యసేవక సంబంధమే అయి ఉంటే అదొక సంగతి. కానీ ఈ సంబంధంలో, అసలు ఏ సేవ్య-సేవక సంబంధంలోనైనా అంతర్గతంగా ఉన్నదేదో ఆ తరువాత కొద్ది రోజులకే నాకు మరోలా తెలియవచ్చింది. నేను తమకి విన్నవించుకోవాలనుకున్న అసలు సంగతి ఇదే.''

ఆ మాటలు చెప్తూ మోహనచంద్ర యథాలాపంగా మాజిస్ట్రేట్‌గారి వెనుక గోడమీద గడియారం కేసి చూశాడు. అది టైము మధ్యాహ్నం ఒంటిగంటన్నరని చూపిస్తుండటంతో ఆగిపోయాడు. అతడు ఎందుకు ఆగిపోయాడో ఒక క్షణం అర్థంకాని మాజిస్ట్రేట్ అతనికేసి సాలోచనగా చూసి ఆ వెనుక అతని చూపుల్ని బట్టి లంచ్ విరామం ఇవ్వవలసిన సమయం ఆసన్నమైందని గుర్తించాడు. కోర్టు బంట్రోతు కోర్టు లంచ్ విరామాన్ని ప్రకటిస్తున్నట్టుగా సూచన చేసే ఒక అరుపు అరిచి ముందు దారితీయగా మాజిస్ట్రేట్ అతని వెనుకే తన ఛాంబర్‌వైపు అడుగులేశాడు. ఆయన వెళ్లిన వెనుక కోర్టు హాల్లోని వారంతా నెమ్మదిగా బయటికి కదిలారు. కానీ మోహనచంద్ర తను ఉన్నచోటనే నిస్సత్తువగా కూలబడిపోయాడు. అతని లాయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అతన్ని పలకరించే ప్రయత్నం చెయ్యబోయారు కానీ అతను వారిని లంచ్‌కి పోయిరావాల్సిందిగా అంతసేపూ తనని ఒంటరిగా వదిలిపెట్టాల్సిందిగా సైగచేసి ఊరుకున్నాడు.

## 5

లంచ్ విరామం అయిన వెంటనే మాజిస్ట్రేట్ హాల్లోకి రాలేదు. అర్జెంటుగా ట్రెజరీకి పంపవలసిన కాగితాల్ని పరిశీలించుకుంటూ కొంతసేపు తన ఛాంబర్లోనే ఉండిపోయాడు. ఒక అరగంట ఆలస్యంగా అపరాహ్ణపు కోర్టు మొదలయ్యింది. అప్పుడు కూడా ఒక గలాటా కేసులో నిందితుల్ని పోలీసులు కోర్టులో హాజరు పరచడంతో ముందు ఆ కేసు తీసుకుని వారికి రెండు వారాల జుడీషియల్ కస్టడీ విధించి వారు వెళ్లిపోయిన తరువాత ఆయన మోహనచంద్ర లాయర్ వైపు 'ఇక మళ్లీ కొనసాగించండి' అన్నట్టుగా చూశాడు. మోహనచంద్ర మళ్లీ విట్నెస్ బాక్స్‌వైపు నడిచాడు. అతని అడుగుల్లో ఉదయం కనబడ్డ ఉదాసీనత లేదు. అలాగని ఉత్సాహమూ లేదు. చేపట్టిన ఒక పనిని పూర్తి చేసేవాడికి ఉండేలాంటి ఒక బాధ్యతాయుతమైన నడవడి మాత్రమే అక్కడ ఉంది. అతను గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు.

''నేను చెప్పదల్చుకున్న అంశాలు నాకు స్పష్టంగానే ఉన్నా వాటిని చెప్పబోతున్నప్పుడు ఏవేవో జ్ఞాపకాలు, నన్ను ఇంతదాకా రహస్యంగా పీడిస్తున్నవి-నా ఇష్టంతో నిమిత్తం లేకుండా బయటికి ఉరుకుతున్నాయి. వాటన్నిటినీ ప్రస్తావించి కోర్టువారి సమయాన్ని నష్టపరచడం నాకిష్టం లేదు. నేను చెప్పదల్చుకున్నదేదో తొందరగా ముగించే ప్రయత్నం చేస్తాను.

''నా దగ్గరికి వచ్చిన తరువాత చయనులు కొద్ది రోజుల్లోనే పుష్టిగా తయారయ్యాడు. నన్ను మొదటిసారి కలిసినప్పుడు అర్భకంగా ఉన్న ఆ వ్యక్తి ఇప్పుడు కొద్దిగా లావెక్కాడు. అతని చెంపల్లో ఒక నిగనిగ వచ్చి చేరింది. నాకు ఆశ్చర్యం కలిగించేది అదే. అతడు ఒక స్వతంత్ర మానవుడిగా ఉన్నప్పుడు సిక్‌గా, మార్బిడ్‌గా ఉన్నవాడు ఒక సేవకుడిగా మారగానే బలంగా, ఆరోగ్యంగా తయారయ్యాడు. ఒకరోజు అతడు ఒక స్త్రీని వెంటబెట్టుకుని వచ్చాడు. 'సార్ ఈమె మాకు బాగా తెలిసిన మనిషి. బతికి చెడ్డది. ఈమెకి తమరు ఏదన్నా పని కల్పిస్తే ఇంత తమ సేవ చేసుకుని బతుకుతుంది' అన్నాడు. నేను ఆమెని చూశాను. అంటే ఆమెని ఒక స్త్రీగా చూశానాలి. అలా చూసినప్పుడు ముప్ఫైకి పైబడ్డ ఆ దేహం, వంకీలు తిరిగి వత్తుగా ముడిపెట్టిన కేశరాశి, లోతైన కళ్లు మాత్రమేకాక ఎత్తైన ఆమె వక్షంపైన కూడా నా చూపులు నిలిచాయి. నాకే ఆశ్చర్యమనిపించింది. నేను ఒక మనిషిని నా జీవితంలో మొదటిసారి ఒక స్త్రీగా, అది కూడా ఆమె అవయవాల పొందికపైన దృష్టి పెట్టి చూడటం.

''నిజానికి నా దగ్గర కొత్తగా ఇవ్వగల పనేమీలేదు. అలాగని నా అంగీకారం కోసం చూడకుండానే ఆమె చయనులు వెంట వంటగదిలోకి నడిచింది. ఆరోజు నించీ ఆమె అతనికి కూరలు తరగడంలోనూ, పాత్రలు శుభ్రం చెయ్యడంలోనూ, బట్టలు ఉతకడంలోనూ సాయం చేసేది. కానీ వంట చేసినట్టు మాత్రం ఎప్పుడూ నేను చూడలేదు. ఆమెని చయనులు వంట ముట్టుకోనిచ్చేవాడు కాదనుకుంటాను. నేను ఊళ్లోనే ఉన్న రోజున లంచ్‌కి ఇంటికి వెళ్లినప్పుడు ఆమె ఇంటి వెనుక పెరట్లో తల దువ్వుకుంటూనో లేదా చీర చెరగు పరచుకుని నిద్రపోతూనో కనిపించేది. వాళ్లిద్దరూ నా బంగళా చుట్టూ ఉండే స్థలం చుట్టూ కంచెకట్టి కూరగాయల తోట పెంచారు. అరటి పిలకలు తెచ్చి పాతారు. కంచె మీద కూరగాయల తీగెలు పాకించారు. కొన్నాళ్లకు కంచె మీద తీగెలు పువ్వులు పూసి చిన్నచిన్న పిందెలు తిరి

గేయి. అరటిచెట్లు గెలలు వేసి ఉండేవి. ఆ నిర్భాగ్యులైన పనిమనుషుల రెక్కల కష్టంతో జీవంలేని ఆ గవర్నమెంటు బంగళా ఒక కొత్త శోభను సంతరించుకుంది.

"నా ఉద్యోగంలో కూడా నాకు చాలా మంచి పేరు వచ్చింది. నేను చాలా స్ట్రిక్ట్ ఆఫీసర్ని అనీ, అన్యాయాన్ని సహించననీ జనం చెప్పుకోవడం మొదలు పెట్టారు. అంటే నేను అప్పుడు చేసిందల్లా ఫెయిర్‌ప్రైస్ షాపులు, సినిమా హాళ్లు, రైస్‌మిల్లులూ, దుకాణాలు, తూనికలూ కొలతలూ- ఎక్కడ అవినీతి ఉందని తెల్సినా అక్కడ రెయిడ్ చెయ్యడం, పట్టుకున్న వాళ్లని శిక్షించేదాకా విశ్రమించకపోవడం. ఆ పనిలో ఎటువంటి ఒత్తిళ్లు వచ్చినా లెక్కచెయ్యకపోవడం. నేను సంఘంలో ప్రబలి వున్న అవినీతిలో భాగస్వామిని కాలేదనీ, ఏ ఒత్తిడికీ లొంగలేదనీ, లేశమాత్రమైనా ఏ అన్యాయాన్నీ సహించట్లేదనీ నన్ను నేను అభినందించుకుంటుండే వాణ్ణి. నా జీపు మీద నా మండల పరిధి అంతటా తిరుగుతున్నప్పుడు నాకో విధమైన ఆనందం కలిగేది. అది అంతదాకా నా పూర్వజీవితంలో అనుభవానికి రాని ఆనందం. కానీ ఆరోజు ఆ దురదృష్టకరమైన ఈ రెండు సంఘటనలు జరగకపోయుంటే నేను ఆ ఆనందంలో అలాగే తక్కిన ప్రభుత్వాధికారుల్లాగా జీవిస్తూ ఉండే వాణ్ణి. కానీ నా ఆనందం భ్రమాన్వితమనీ, అది యదార్థానికి హింసాత్మకం తప్ప మరొకటి కాదనీ ఆ రెండు సంఘటనలూ తెలియజేశాయి.

"మొదటిది- ఒకరోజు నేను నా మండలంలోని ఒక సుదూరమైన మారుమూల గ్రామానికి ఒక భూమి తనిఖీకి వెళ్లినప్పుడు జరిగింది. ఆరోజు నేను ఇంకా పని మొదలుపెట్టకుండానే ఆ గ్రామస్థులంతా నన్ను చుట్టుముట్టారు. వాళ్లలో ఎక్కువమంది ముసలివాళ్లూ, భర్తలు లేని దిక్కుమాలిన స్త్రీలూను. వాళ్ల డిమాండ్ ఏమిటంటే గ్రామంలో ఉన్న వృద్ధులకీ, వితంతువులకీ పెన్షన్లు అందటం లేదని, అవి అందరికీ మంజూరు చెయ్యాలనీ, అంతటితో ఆగక వాళ్లు నన్ను ఘెరావ్ చేశారు. అందరికీ పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇస్తే తప్ప నన్ను కదలనివ్వమన్నారు. పాపం వాళ్లు చేసింది సత్యాగ్రహమే కానీ అది నాలో నేను ఊహించని సంవేదనలు రేకెత్తించింది. నిజానికి ఆ ముసలివాళ్ల పట్లా, ఆ దిక్కులేని స్త్రీల పట్లా నాకు కూడా ఆవేదన ఉంది. అటువంటి వాళ్లకోసం అదనంగా బడ్జెట్ ఇవ్వాలని నేను ఎన్నోసార్లు జిల్లాకలెక్టర్‌కు విజ్ఞప్తిచేసి ఉన్నాను కూడా. కానీ ఆ క్షణాన మాత్రం వాళ్లు అలా పట్టుపట్టినప్పుడు వాళ్లకి ఎప్పటికీ ఎవ్వరూ పెన్షన్ మంజూరు చెయ్యకూడదనిపించింది. వాళ్ల వల్ల నాకు కలిగింది భయం కాదు. అదొక చిత్రమైన అనుభవం. అప్పుడు నాకు కలిగిన ఫీలింగ్ ఏమిటో ఆ రాత్రి జరిగిన అత్యంత దురదృష్టకరమైన మరొక అనుభవం వల్లగానీ అర్థం కాలేదు."

ఆ మాటల తర్వాత మోహనచంద్ర కొంతసేపు ఆగాడు. అది బహుశా తను తర్వాత చెప్పవలసిన మాటల్ని కూర్చుకోవడం కోసమో లేక ఆ మాటలు చెప్పాలా వద్దా అన్నది నిర్ణయించుకోవడం కోసమో తెలియదు. ఏమయితేనేం అతను మళ్లా మొదలు పెట్టాడు.

"అయ్యా, అసలు సంఘటనకు వస్తున్నాను. అదే నేను మీ ముందు ఒప్పుకోవాల్సిన నేరం. మీ మొత్తం జూరిస్‌ప్రుడెన్స్ అంతటినీ జ్ఞప్తికి తెచ్చుకుని వినండి. ఆ రాత్రి నా ప్రతి ఒక్క కదలికా, ప్రతి ఒక్క చేష్టా నాకు ఎంతో గుర్తు. అవి నా జాగృత్, స్వప్నావస్థల్లో కూడా మరుపుకు రావు. ఆ సాయంకాలం ఆ ఊరు నుండి తిరిగి వచ్చానన్న మాటే కాని నేనేదో ఒక దుర్భరమైన శారీరక హింసకి గురైనవాడిలా ఉన్నాను. అంత అలసట నాకెందుకు కలిగిందో తెలియదు. ఆ దీనులైన పేద వాళ్లు నన్నేమన్నారని? భరించలేని తమ జీవిత దీపం కొడిగట్టకుండా ఇంత భృతి కల్పించమన్నారు. అంతేకదా! మరి దానివల్ల నాకెందుకంత కలత కలిగింది? ఇంటికి వచ్చానన్నమాటే గానీ నా మనసు మనసులో లేదు. నా బంగళా సమీపిస్తూనే డ్రైవర్ హారన్ మోగించాడు. సాధారణంగా ఆ హారన్ వింటూనే చయనులు బయటికి వచ్చి నా బ్రీఫ్‌కేసు అందుకుంటుంటాడు. కానీ ఆరోజు చయనులకు బదులు ఆ ఆడమనిషి వచ్చింది. ఆమెని చూస్తూనే నా డ్రైవర్ ముఖం చిట్లించుకున్నాడు. అతనికి మొదటినుంచీ ఆమెని చయనులు ఈ ఇంట్లో ప్రవేశపెట్టడం ఇష్టం లేదు. ఒకటి రెండుసార్లు ఆమె గ్రహించేలా సూచన చేశాడు కూడా. ఆమె నా బ్రీఫ్‌కేసు అందుకోవడానికి వస్తుంటే నా డ్రైవర్ ఆమెమీద ఆ పెట్టె విసిరినంత పనిచేసి, 'వాడేమయ్యాడు?' అని అడిగాడు. ఆమె డ్రైవర్ ముఖంకేసి చూసే సాహసం చెయ్యలేకుండా భయంతో వణుకుతూ, 'అయ్యా, ఇప్పుడే వస్తానని పోయిండు,' అని వెనక్కి చూడకుండా తొట్రుపడే అడుగుల్తో లోపలకు వెళ్లిపోయింది. నేను కూడా అలసటగా ఆమె వెనుకే అడుగుపెట్టాను.

"లోపలికి వెళ్లి నిస్సత్తువగా కూచున్నానో లేదో ఆమె వచ్చి తలుపు పక్కన నించుని, 'అయ్యా, మీరు అలిసిపోయినట్టుండారు. కొద్దిగా వేణ్ణీళ్లు కాచి వుంచాను. స్నానం చెయ్యరాదా,' అంది. ఆమె మాట కాదనలేక స్నానంచేసి వాలుకుర్చీలో రిలాక్స్ అవుతూ జారబడ్డాను. అలా కొంతసేపు గడిచాక ఆమె మళ్లా వచ్చి, 'అయ్యా భోంచేద్దురుగాని లేవండి,' అంది.

"నేను, 'చయనులు ఏమయ్యాడు,' అన్నాను. ఆమె ఏమీ మాట్లాడలేదు. రెట్టించి మళ్లా అడిగితే ఊరెళ్లాడనీ మర్నాడు వచ్చేస్తాడనీ చెప్పింది. నాకు ఆశ్చర్యమేసింది. అంతవరకూ అతనెప్పుడూ ఎక్కడికి వెళ్లింది లేదు. ఒకవేళ వెళ్లినా చెప్పకుండా వెళ్లవల్సిన అవసరమేముంది? 'మరి ఇందాక డ్రైవర్తో ఇప్పుడే వచ్చేస్తాడని అన్నావే,' అన్నాను. 'వాడు మంచోడు కాదయ్యా. ఈడు లేడని చెప్తే మండిపడతడని అట్లన్నను,' అంది. 'మరి వంటెవరు చేశారు,' అని అడిగాను. 'నేనే చేశానయ్యా. ఈడు పోతా పోతా హోటల్ నుంచి తెప్పించమన్నడుగానీ నాకే మనసొప్పల,' అంది.

"నేను భోజనానికి కూర్చోబోయేముందు ఆమె, 'అయ్యా, నేను స్నానం చెయ్యకుండ నీకు వడ్డించలేను. ఒక్కక్షణం ఆగితే వస్త,' అని స్నానం చేసి వచ్చింది. అన్నం పెట్టింది. చయనులు నాకు అన్నం పెట్టడంలో ఒక సేవ మాత్రమే ఉంది. కానీ ఆమె అన్నం పెట్టినప్పుడు అందులో మా అమ్మని గుర్తు చేసేదేదో కూడా కనిపించింది. కానీ కొద్దిసేపే. ఆ తరువాత జరిగింది అందుకు విరుద్ధం.

"నేను ఇంక విశ్రమించబోయే ముందు ఆమె తన భోజనం కూడా కానిచ్చుకుని గిన్నెలు సర్దుకునేదాకా ఆగాను. ఆమె వెళ్లిపోగానే తలుపులు వేసుకుని నిద్రపోవాలని నా ఆలోచన. అంతదాకా నా మంచం మీద వెల్లకిలా పడుకుని దీపం వెలుతురు కళ్లమీద పడకుండా మోచేయి అడ్డుపెట్టుకుని ఉన్నాను. నా కాళ్లు ఒకటే లాగుతున్నాయి. వళ్లు నొప్పులుగా ఉంది. ఆమె తన పని ముగించుకుని నా బెడ్రూం తలుపు దాకా వచ్చి, 'నేను వెళ్లొస్తనయ్య,' అంది. సరే అనాలికదా. కానీ అనలేకపోయాను. ఆమె వెళ్లిపోతుందంటే నాకెందుకో అంగీకరించాలనిపించలేదు. 'చూడు, నా కాళ్లు కొద్దిగా నొప్పులుగా ఉన్నాయి. పాదాలు పట్టగలవా?' అని అడిగాను. ఆమె కళ్లల్లో కనీకనిపించని ఆశ్చర్యం ఒక్క లిప్తపాటు మెరిసి మాయమైంది. 'అలాగేనయ్య,' అందామె. వచ్చి నా మంచం పక్కగా నేల మీద మోకాళ్ల మీద కూచుని నా పాదాల్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఆ క్షణాన్ని గుర్తుపెట్టుకోండి. మిలార్డ్! నాలోని మనిషి పూర్తిగా మరణించిన క్షణం అది. నాలోని అధికారి నా మానవత్వాన్ని పూర్తిగా కూల్చివేసిన క్షణం అది.

"ఆమె తన బలమైన అరచేతుల్తో, కాయకష్టంతో కాయలు కాచిన అరచేతుల్తో నా పాదాలు ఒత్తుతుంటే ఆ ఫ్లోరసెంట్ వెలుతుర్లో ఆమె లేత నీలంరంగు వాయిల్‌చీర, రంగు వెలిసి పోయిన ఆ బీదవస్త్రం నన్ను పూర్తిగా అంధుణ్ణి చేసింది. నేను ముందుకు వంగి నా పాదాలు పడుతున్న ఆమె చేతుల మీద నా చెయ్యి వేశాను సందేహంతో, బెరుగ్గా. అప్పటి నా చేతుల వణుకు నాకు ఇప్పటికీ గుర్తు. ఆమె ఏమీ మాట్లాడలేదు. ఏమీ జరగనట్టే తల ఎత్తకుండానే నా పాదాల్ని వత్తుతూనే ఉంది. నేను నా చేతుల్ని ఆమె మణికట్టు మీదుగా జారిన మట్టిగాజుల్ని తడుముతూ ఆమె వక్షం వైపు పోనిచ్చాను."

## 6

ఉదయం మోహనచంద్ర వాంగ్మూలం న్యాయ పరిభాషలోకి తిరిగినప్పుడు కనిపించిన అసహనం ఇప్పుడు కోర్టుహాల్లో లేదు. చీమ చిటుక్కుమన్నా కూడా భరించలేనత ఉత్కంఠ అక్కడ అలుముకుంది. ఒక నేరగాథతో మనుషులకి అప్రయత్నంగా కలిగే తాదాత్మ్యంలోని పారవశ్యం అక్కడ ఆవరించి ఉంది.

"అయ్యా," ఆ యువకుడు తదుపరి మాటల కోసం తడుముకుంటున్నాడు. అతని కళ్లల్లో మసగ్గా నీటిపొర కమ్మింది.

"అయ్యా, ఆ రాత్రి నేను మొదటిసారిగా ఒక లైంగికానుభవాన్ని పొందాను. కానీ అది ఇద్దరు స్వతంత్ర మానవుల మధ్య సంభవించింది కాదు. అది ఒక అధికారికీ, ఒక సేవకురాలికీ మధ్య, ఒక యజమానికీ, బానిసకీ మధ్య సంభవించింది. నాతోటి మానవుడిని సేవకుడిగా మార్చిన నా అనుభవం అతడిని ఒక స్త్రీగా, అతడి స్త్రీని ఒక సేవకురాలిగా, ఆ సేవకులిద్దరినీ నా శారీరక వినియోగాన్నిచ్చే వస్తువులుగా మార్చుకోవడంగా కొనసాగి చివరికి ఆ ఇంటిలోని ఆ దీనురాలిని నా శయ్యగా మార్చుకోవడంతో ముగిసింది. అవును ఆ అనుభవంతో నేను పూర్తిగా భ్రష్టుణ్ణయ్యాను. కానీ ఆ అనుభవమే నాకు నా ఉద్యోగం గురించిన జ్ఞానోదయాన్ని కలిగించింది. ఆ భ్రష్టత్వం లాంటిది మీకు సంభవిస్తే మీరు కూడా మీ ఉద్యోగం గురించిన నిజమైన జ్ఞానాన్ని పొందుతారని చెప్పడానికి నేను సాహసిస్తున్నాను.

''అవును. ఆ అనుభవం అయినప్పుడే నాకు ఆరోజు ఉదయం ఆ గ్రామంలో పేదవాళ్లు నన్ను నిల దీయడం వల్ల కలిగిన ఫీలింగ్ ఏమిటో అర్థమయింది. నేను చెప్తున్నది నిజం. ఆ ఉదయం ఆ గ్రామంలో ప్రజా సంఘం నన్నట్లా నిలదీసినప్పుడు నాకు కలిగిన ఆ ఫీలింగ్ ఒక కాస్ట్రేషన్ ఫీలింగ్ అని, ఎవరో నా పుంసత్వాన్ని ఛేదిస్తున్న విదారుణ అనుభవం అనీ ఆ రాత్రి గ్రహించాన్నేను.

''ఎక్కడిదీ నాకీ పుంసత్వం? ఇదే నేను మీకు చెప్పాలనుకున్నది. ఉద్యోగంలోకి రాక ముందు నేను ఒక మనిషిని. నాకు అప్పుడు ఆడా మగా తేడా తెలియదు. ఉచ్చనీచ భావాలు లేవు. సూపర్ ఆర్డినేషన్, సబార్డినేషన్లు తెలియవు. అప్పుడు నాకు ఆగ్రహంలేదు. పగ తెలియదు. ప్రతీకారం తెలియదు. కానీ నా ఉ ద్యోగం నన్ను మార్చేసింది. ఈ లక్షణం నా ఉద్యోగానికి ఎక్కడి నుంచి వచ్చింది?

''అయ్యా! కోర్టువారికి నేను మనవి చేసుకునేదే మంటే నన్ను నేరస్థుడిగా మార్చిందీ, నాలోని మనిషిని నశింపజేసి నాతోటి మనిషికి యజమానిగా మార్చిందీ మీరు ఎంతో ఆరాధించే ఇండియన్ పీనల్ కోడ్ అంటే నమ్ముతారా? వినటానికి కష్టంగా ఉన్నా, మీరు ఈ మాటలు కూడా వినక తప్పదు. మీరు భారతీయ శిక్షా స్మృతి చరిత్ర చూడండి. అంతకుముందు ఈ దేశంలో హిందూ మహమ్మదీయ న్యాయస్మృతులుండేవి. అడవుల్లో ఆదివాసుల నోటిమాటల సత్యప్రమాణిక మైన ధర్మం ఉండేది. అప్పుడు నేరమనేదానికి వాళ్లిచ్చిన నిర్వచనమేమిటి? అయితే అది భగవంతుడి ఆజ్ఞని ఉల్లంఘించడం. లేదంటే తోటిమనిషిని కష్టపెట్టడం. అందుకు పరిహారమేమిటి? హృదయపూర్వక పశ్చాత్తాపం లేదా కొంత జరిమానా. అదికూడా ఎలాగను కున్నారు? తన సంఘంలో ఇరుగు పొరుగు అందరికీ ఒక విందు చెయ్యడం. అంటే తినిపించడం లేదా తాగిం చడం. దానికి డబ్బు కావాలి. కాబట్టి నేరస్థుడు తను దాచుకున్నదన్నా ఖర్చు చెయ్యాలి, లేదా అప్పు చెయ్యాలి. ఆ అప్పు తీర్చడానికి మరింత కష్టపడాలి. అంటే ఏ తప్పుకైనా శిక్ష మరింత శారీరక శ్రమ. అది కూడా అదనపు ఉత్పత్తిని ప్రోత్సహించే శ్రమ. అందులో అవమానం లేదు. దుఃఖం లేదు. న్యూనత లేదు. తప్పు మానవ సహజం. తప్పు చేసినవాడు తన తోటివాళ్ల కన్నా మరిన్ని ఎక్కువ గంటలు కష్టపడాలి. అంతే ఆ తత్వశాస్త్రం.

''కానీ మన పీనల్ కోడ్ చూడండి ఎవరు దీని రూపకర్తలు? ఎవరు మనని బానిసల్ని చేసారో వాళ్లే దీన్ని రచించింది. విజేతలు ఒక విజిత భూమి కోసం చేసిన శాసనం అది. దానికీ, దానికి పూర్వం ఈ దేశంలోని స్మృతులకూ తేడా చూడండి. అంతకు ముందు చట్టా ల్లేవు. ఒప్పందాలున్నాయి. వాటిని ఉల్లంఘించడం నేను ఇందాకా చెప్పినట్టుగా అయితే దేవుణ్ణి ధిక్కరిం చడం, లేదా మనిషిని మోసగించడం. కానీ ఈస్టిండియా కంపెనీ తయారుచేసిన శిక్షాస్మృతిలో మొదటిసారిగా స్టేట్ అనేది వచ్చింది. ఈ స్టేట్ ఎవరు? అది దేవుడూ కాదు, మనిషీ కాదు. కానీ ఇది కొందరు మనుషులకి అధిక సంఖ్యాకులైన తక్కిన మనుషుల్ని అణిచి వుంచ డానికి దేవుణ్ణి మించిన అధికారాల్ని కట్టబెట్టింది. మొదటిసారిగా పీనల్ కోడ్ ఒక మనిషి చేసే ఒక నేరాన్ని స్టేట్ పట్ల నేరంగా చూపించే ప్రయత్నం చేసింది. అంటే ఇద్దరు రహస్యంగా ఒక ఒప్పందం చేసుకున్నారను కోండి. అందులో ఒకడు మరొకడిని మోసగించాడను కోండి. పూర్వం అయితే అది దేవుణ్ణి మోసగించడం లేదా మనిషి తోటిమనిషిని మోసగించడం. కానీ కంపెనీ స్మృతికారుల కొత్త భాష్యం ఏమిటంటే అటువంటి ఉల్లంఘన ఒక బ్రీచ్ మాత్రమే కాదు. క్రిమినల్ బ్రీచ్ మాత్రమే కాదు, అది స్టేట్ని మోసగించడం కూడా. అప్పుడు స్టేట్ దాని మీద ప్రతీకారం తీర్చుకోవడం మొదలుపెడుతుంది. అది కూడా ఎవరి ద్వారా? మీ ద్వారా, నా ద్వారా, ఈ లాయర్ల ద్వారా, ఈ కోర్టు బంట్రోతుల ద్వారా, మొత్తం ఈ వ్యవస్థ అంతటి ద్వారా. కోర్టు అంటే ఒక న్యాయసమ్మతమైన తీర్పు మాత్రమే అనుకునేరు. నేను ఒకసారి ఒక తీర్పు ఇచ్చినా ఒక నిందితుడిని వెంటనే విడుదల చెయ్యలేకపోయాం. ఎందుకో తెలుసా? నా కోర్టు సీలు నా బంట్రోతు మర్చిపోయి వచ్చినందువల్ల. నా సంతకం ఉన్నా ఆ సీలు లేకపోతే సబ్జైలు అధికారులు ఆ ఉత్తర్వుని అంగీకరించనందువల్ల. ఇప్పుడు చెప్పండి. స్టేట్ అంటే ఏమిటి? మనమా? మన సంతకమా? మన పేరు హోదా రాసి ఉండే ఒక రబ్బరు ముద్రనా?

''కోర్టువారు, దయచేసి నేను ఉపన్యాసం ఇస్తు న్నానని అనుకోవద్దు. నా ఆవేదనని గమనించండి. స్టేట్ అంటే మనని జయించినవాడు మనని సర్వకాల సర్వా వస్థల్లోనూ అణచి ఉంచే ఒక లైంగిక శక్తికి ప్రతీక అని నేను చెప్తే మీరు అన్యథా భావించకండి. మీ న్యాయ వ్యవహారమంతటికీ సారాంశప్రాయమైన పీనల్కోడ్ ఆ

లైంగికశక్తికి ఒక జస్టిఫికేషన్ మాత్రమే. నేను ఒక ఎమ్మార్వోగా చేసినదంతా వాస్తవంగా ఏమిటి? అసలు నేను ఎమ్మార్వోగా ఒక మనిషిని కాను, ఒక మహా కాయుడైన రాజ్యపురుషుడి తొడల మధ్య వేలాడే ఒక మేఢ్రాన్ని కానా నేను?''

కోర్టు హాల్లో కలకలం రేగింది. మాజిస్ట్రేట్ ముఖంలో కోపాన్ని బలవంతంగా ఆపుకుంటున్న ఛాయలు కనిపించాయి. నిందితుడు వాడిన చివరి మాట ఏమిటో అర్థంకాక కోర్టు టైపిస్ట్ కంగారుపడ్డాడు. కానీ మోహనచంద్ర అదేమీ పట్టించుకోకుండా కొనసాగించాడు.

''అవును. నేను నా ఉద్యోగం తొలినాళ్లలో అనుభవించిన ఆ ఆనందమేమిటో అర్థం చేసుకోగలిగాను. అది ఒక పెనిట్రేషన్‌లోని ఆనందం. నేను నా జీపు మీద నా మండలపరిధిలో తిరుగుతున్నప్పుడు నా ద్వారా స్టేట్ ప్రజాదేహంతో ఒక రతిని అనుభవించింది. పూర్వం రాజులు అశ్వమేథాలు చేసేవారు చూడండి. అప్పుడు గుర్రాన్ని వదిలిపెట్టేవారు. ఆ గుర్రం ఎంత దూరంపాటు ఎదురులేకుండా తిరుగుతుందో అంత మేరకు ఆ రాజు అధికారం చెల్లుబాటైనట్టు. అదిగో ఆ గుర్రంలాంటివాణ్ణి నేను. నేనెంత దూరం తిరిగితే అంత దూరం స్టేట్ లైంగికశక్తి అప్రతిహతంగా సాగుబాటయినట్టు. ఇది ఒక స్వస్థ మానవుడు కోరుకునే అనుభవమేనా? ఇటువంటి అనుభవానికి నన్ను అలవాటు చేసే ముందు స్టేట్ నాలోని మానవత్వాన్ని ఒక పథకం ప్రకారం ఎండగట్టింది. నేను చదువుకునే రోజుల్లో ప్రయాణాలు చేసేటప్పుడు బస్సెక్కితే ఎక్కడో ఒక సీటు కిటికీ పక్క వెతుక్కుని దారి పొడవునా చెట్లనీ, పొలాల్నీ, మేఘాల్నీ, పక్షుల్నీ చూస్తూ కలల్లో తేలిపోతుండేవాణ్ణి. కానీ ఇప్పుడు ఒక వెహికిల్ ఎక్కితే నా దృష్టి ఎంతకూ దిగబోయే ఊరు ఎప్పుడు వస్తుందా అనే. ఇప్పుడు నేను తీరకని భరించలేను. ఎందుకంటే తీరిక నన్ను నాకు గుర్తుచేస్తుంది కనుక. నాకు నా టైము అంటూ వుండడానికి వీల్లేదు. ఎందుకంటే ఇప్పుడు నేను నాకు చెందను కనుక. మీకు తెలుసుకదా ఉద్యోగంలో చేరినప్పుడే ప్రభుత్వం మనకి చెప్పింది మనది 24 గంటల పని అని. ఆ మాటకి అర్థం నెమ్మదిగా తెలుసుకున్నాను. అవును. నేను ప్రభుత్వ సేవకుడిని అయ్యానంటే దానర్థం ప్రభుత్వం తన లైంగిక ఆనందానికి నా శరీరంతో నేను తోడ్పడాలనే కదా! అందుకే నేను ఒక సేవకుడిని పెట్టుకున్నప్పుడు, అతడు తనకు మరొక సేవకురాల్ని తెచ్చుకున్నప్పుడు అందరం చేసింది ఒకరి లైంగిక ఆనందానికి మరొకరి శరీరాన్ని వాడుకోవడమే కదా! నా కథలో ఇంకా ఒక చిన్నభాగం ఉండిపోయింది. అది కూడా చెప్పనివ్వండి. చయనులు ఆ ఆడ మనిషిని తెచ్చుకోవడం నా డ్రైవర్‌కి, ఆఫీసు సిబ్బందికీ ఇష్టం లేక పోయింది అని చెప్పాను కదా. నేను ఒకసారి వారం రోజులు సెలవుపెట్టి మా ఊరు పోయి రావల్సి వచ్చింది. ఆ వారంరోజులూ నా బంగళాని చయనులు మీదే వదిలిపెట్టి వెళ్లాను. నేను తిరిగి వచ్చేటప్పటికీ నా ఆఫీసు సిబ్బంది మొత్తం కూడబలుక్కుని మరీ చయనులు మీదా, అతని ఆడతోడు మీదా అభియోగాల్తో నన్ను ముంచెత్తారు. నేను లేనప్పుడు చయనులూ, ఆ ఆడమనిషీ నా ఇంట్లోనే మకాం పెట్టారనీ, అంతేకాక నా బెడ్‌రూం వాడుకోగా కూడా తాము చూశామనీ వాళ్ల ఆరోపణ. అంతేకాదు, చయనులు నా పేరు మీద ఊళ్లో అందినచోటల్లా అప్పులు చేశాడనీ, బట్టల కొట్లో ఖాతా తెరిచాడనీ కూడా. ఇవన్నీ వింటున్నా చలించనివాణ్ణి, చివరకు మా ఆఫీసు అటెండర్ ఒకడు, ఆఫీసు పనిమీద వచ్చేవారి దగ్గర నుండి చయనులు డబ్బు వసూలు చెయ్యగా తను చూశానని చెప్పడంతో నేను ఆగలేకపోయాను.

''ఇంటికి వెళ్లడమేమటి చయనుల్ని బయటికి నడవమన్నాను. తెల్లబోయిన అతడి ముఖం కూడా చూడకుండా, అతనికి చెప్పుకునే అవకాశం కూడా ఇవ్వకుండా అతని గుడ్డలు పెట్టుకునే డొక్కు సూట్‌కేసును బయటకు విసిరేశాను. అతని వెనుకే అతని ఆడమనిషి కూడా గుడ్లనీళ్లు కుక్కుకుంటూ బయటకు నడిచింది. ఆ పనిమనుషులిద్దరినీ నా ఆఫీసు పనిమనుషులు దొంగల్లాగా, జంతువుల్లాగా యుద్ధంలో ఓడిపోయి పట్టుబడి బానిసలుగా మారిపోతున్న వాళ్లని చూసినట్టుగా ఉండిపోయారు.

''న్యాయమూర్తీ! నాకు చెప్పండి. నేను చేసిన పని సమంజసమేనా? అది మహాపాపం కాదా? నేను అతనికి విధించిన శిక్ష ప్రిన్సిపుల్స్ ఆఫ్ నాచురల్ జస్టిస్‌కి వ్యతిరేకం కాదా? ఇంతకీ అతను, లేదా వాళ్లిద్దరూ చేసిన నేరమేమిటి? వాళ్లు దేవుణ్ణిగానీ మనిషినిగానీ మోసగించలేదే. వాళ్లు ఆ బంగళాలో వారంరోజులు మకాం పెడితే తప్పేమిటి? నేను వాళ్ల శరీరాల్నే సుఖసామగ్రిగా వాడానే.

''అతను అర్జీదారుల నుండి డబ్బులు వసూలు చేసినట్లయితే అది తప్పే. కానీ దానికి అదే శిక్ష అయితే,

ఆ శిక్ష నా ఆఫీసు సిబ్బంది మొత్తానికి నేను అంతకు ముందే విధించి ఉండాలే. ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తోంది. నాకు కోపం రావడానికి కారణం అతడు డబ్బు తీసుకుంటున్నాడన్న ఆరోపణ కాదు. అంతకు మించిందేదో రహస్యమైన కారణం ఉంది. అది నా లైంగికతని, నా పుంసత్వాన్ని దేన్నో రెచ్చగొట్టిన కారణం. ఆ పుంసత్వం నాది కాదు. నా యజమాని అయిన స్టేట్‌ది. అంటే నా ఉద్యోగం నన్ను మనిషిగా పూర్తిగా నశింపజేసి ఒక మగవాడిగా, ఒక లైంగికావయవంగా మార్చినదాని పర్యవసానమే కదా అది.

"ఇప్పుడు స్టేట్ నామీద ఈ కేసులో పీనల్‌కోడ్ లోని సెక్షన్లు 441, 442, 509ల ప్రకారం అభియోగాలు మోపింది. ఒకటి క్రిమినల్ ట్రెస్‌పాస్. రెండవది హౌస్ ట్రెస్‌పాస్. మూడవది ఒక స్త్రీ పట్ల అసభ్యకరమైన హావభావాలు ప్రదర్శించడం. ఇవి నిజం కాదనీ, వీటి వెనుక నా మెన్స్‌రియా పరిశుద్ధమైందని నా లాయర్ వాదించాడు. కానీ యువరానర్! అసలు ఈ సెక్షన్లను రూపొందించిన వారి సంకల్పమే పరిశుద్ధమైంది కాదు. ఈ దేశంలోకి అన్యాయంగా చొరబడినవాడికి క్రిమినల్ ట్రెస్‌పాస్ గురించి మాట్లాడే హక్కు ఏముంది? అటువంటివాడి సృష్టిగా కొనసాగుతున్న ఈ రాజ్యానికి ఒక పాశవిక అంగంగా మారినపుడే నేను ఇక్కడి స్త్రీలకీ, నేలకీ, జాతికీ, ప్రజకీ అవమానం చేసినవాణ్ణయ్యాను. ఇక కొత్తగా నామీద ఇప్పుడు కేసు ఏమిటి?

"ఇది కూడా గమనించాను నేను. ఎప్పుడన్నా ఈ రాజ్యం, లేదా ఈ రాజ్య పరికరాలమైన మేము అన్యాయాన్ని సరిదిద్దాలని అంటున్నామంటే దాని అర్థం మా లైంగికత ఎక్కడో గాయపడిందన్నమాట. ఎవడో రాజ్య యంత్రాంగానికి బయట ఆ అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లుగా మేం గుర్తించామన్నమాట. దాన్నే మన భాషలో చట్టాన్ని వాళ్ల చేతుల్లోకి తీసుకుంటున్నారు అంటాం. అలా ఎవరన్నా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం మనని ఒక క్యాస్ట్రేషన్ ఫీలింగ్‌కి గురిచేస్తుంది. మనం ప్రతీకారం తీర్చుకునేలా చేస్తుంది. ఆరోజు ఆ తల్లీపిల్లా తిండి లేక మాడుతుంటే ఒక మనిషిగా నేను ప్రతిస్పందించాల్సిన పద్ధతి అదేనా? బహుశా వాళ్లకి నా దగ్గర ఏముంటే అదిచ్చి, ఆ పూట వాళ్ల ఆకలి మాన్చి ఉండాలి కదా. అది నా మానవ సామర్థ్యానికి ఒక సవాలుగా తీసుకుని ఉండాలి కదా. కానీ ఒక అధికారిగా నా ప్రతిస్పందన ఆ విధంగా లేదు. అది నా లైంగిక సామర్థ్యానికి సవాలుగా భావించాన్నేను.

"అందుకనే నా రెయిడ్‌ని ఒక లైంగిక అత్యాచారంగా వాళ్లు భావించడంలో నాకు ఇప్పుడేమీ ఆశ్చర్యం కలగట్లేదు. రామినాయుడు ఒక దురుద్దేశంతోనే నా మీద ఈ కేసు పెట్టాడనుకున్నా ఆ దురుద్దేశం వెనక రాజ్యంపట్ల అతని అవగాహన సదవగాహనే అని అనుకుంటున్నాను. ఎన్ని లోపాలున్నా అతడు ప్రజా ప్రతినిధి. ఎన్ని సుగుణాలున్నా నేను కలోనియల్ అవశేషాన్ని."

ఇక ఆపైన మోహనచంద్ర మాట్లాడటానికేమీ లేదన్నట్లుగా ఆగిపోయాడు. మళ్లీ ఒక్కక్షణం తరువాత "కాబట్టి కోర్టువారికి నేను విన్నవించుకునేదేమంటే నేను తప్పు చేసాను. నేను శిక్షార్హుణ్ణి. కానీ ఆ తప్పుకి బాధ్యత నాలోని మనిషిది కాదు. నాలోని అధికారిది. ఆ అధికారాన్ని విచక్షణారహితంగా నాకు ధారాదత్తం చేసి, నన్ను నాతోటి మనుషుల పైన తీర్పరిగా, యజమానిగా మార్చిన మీ సకల శిక్షాస్మృతులదీను. మీరు శిక్ష విధించవలసింది నాలోని అధికారికీ, ఆ అధికారిని తయారు చేసిన ఈ రాజ్యానికీ" అన్నాడు.

ఇక ఆపైన మాట్లాడలేక మౌనంగా ఉండిపోయాడు. అప్పుడు అతని వదనంలో ఒక దీర్ఘకాలపు డిప్రెషన్ నుండి బయటపడిన మానసికరోగి ముఖంలో కానవచ్చే తేటతనం లాంటిదేదో కానవచ్చింది.

ఆ సమయానికి బయట మధ్యాహ్నపు ఎండ సన్నగిల్లి చలికాలపు గాలుల తొలితెమ్మరల చల్లదనం అంతటా ఆవరిస్తో ఉంది.

## 7

ఆ కేసు ఏ విధంగా డిస్పోజ్ అయిందన్నది ఏమంత ముఖ్యం కాదుగానీ ఆ తరువాత కొన్నిరోజులకే మాజిస్ట్రేట్‌గారి దగ్గర బంధువుల అమ్మాయితో మోహనచంద్ర వివాహం అయ్యిందని తెలుసుకుంటే చాలు.

*ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య సంచిక, ఏప్రిల్ 2002*

